



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 76 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ మంగళవారం 09 డిసెంబర్ 2025 పేజీలు : 12 వెల : 2/-


## ఇండిగో వ్యవహారం..

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ప్రధాని ప్రశంస



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండిగో వ్యవహారంలో ప్రయాణికులకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నారని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ప్రధాని మోదీ కితాబిచ్చారు. శాఖాపరంగా సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారని ప్రశంసించారు. విమర్శలు మిగతా .. 2లో..

## వందేమాతరం వలే నెహ్రూపై చర్చ పెడదాం..

### ప్రియాంకా గాంధీ ఈ సలహా ఎందుకిచ్చారంటే..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై జరుగుతోన్న చర్చలో భాగంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడారు. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ మిగతా .. 2లో..

## సీఎం మార్పు ఊహాగానాల వేళ...

### సీఎం సిద్ధూకు సుప్రీం కోర్టు నోటీసుతు



**విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సోమవారం సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. 2023లో వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె.శంకర అనే వ్యక్తి అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. దీనికి సమాధానం ఇవ్వాలని సీఎంను కోర్టు ఆదేశించింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధన ప్రకారం సిద్ధూ అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, మిగతా .. 2లో..

## 2025-26 రెండో త్రైమాసికంలో

# 11.28 శాతం జీఎస్డీపీ వృద్ధి నమోదు



- ← రాష్ట్రస్థూల ఉత్పత్తిలో పరిశ్రమలు, వ్యవసాయం, సేవల రంగాల పురోగతి
- ← ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 17.11 శాతం జీఎస్డీపీ వృద్ధి లక్ష్యం
- ← పరకామణి చోరీ చిన్న విషయమని సమర్థింపు ఏమిటి..?
- ← తప్పు చేసిన ఈవోను సస్పెండ్ చేసి...అరెస్ట్ చేయించాం
- ← 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో నమోదైన గణాంకాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి



అమరావతి, డిసెంబర్ 8: గత పాలకులు విధ్వంసం చేసిన వ్యవస్థలను గాడిలో పెట్టి... రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తద్వారా గతంతో పోలిస్తే మెరుగైన వృద్ధి రేటు గణాంకాలు నమోదు అవుతున్నాయని ఆయన వివరించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో నమోదైన గణాంకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. ప్రస్తుత ధరల వద్ద నమోదైన ఆర్థిక వృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తి, గ్రాస్ వాల్యూ అడిషన్, వ్యవసాయం, ఉత్పత్తి, సేవా రంగాలు నమోదు చేసిన వృద్ధి గణాంకాలను ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి మిగతా .. 2లో..

## చైనా ప్రయాణాల విషయంలో జాగ్రత్త..

### భారత విదేశాంగ శాఖ



**విశ్వం వాయిస్ న్యూస్ :** చైనాకు ప్రయాణిస్తున్నప్పుడు, లేదా ఆ దేశం మీదుగా రాకపోకలు సాగించే సమయంలో భారత పౌరులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విదేశాంగశాఖ సూచించింది. బీజింగ్ సైతం భారత ప్రయాణికుల విషయంలో సక్రమంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ అంశంపై చైనాలోని షాంఘై విమానాశ్రయంలో ఇటీవల ఓ భారత మహిళకు మిగతా .. 2లో..

## అది తీవ్రమైన అంశమే కానీ..

# అత్యవసర విచారణ చేయబోం..

### ఇండిగో సంక్షోభంపై సుప్రీం

**విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఇండిగో సంక్షోభం'పై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. సర్వీసుల్లో తీవ్ర అంతరాయాన్ని ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. దాని పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభించిందని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. "ఇది తీవ్రమైన అంశమే. భారీ సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఈ సమస్య మిగతా .. 2లో..



## 'స్క్రబ్ టైఫస్' వలన మరణాలు సంభవించకుండా

# అప్రమత్తంగా ఉండాలి

### గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**గుంటూరు, విశ్వం వాయిస్ ప్రతినిధి :** జిల్లాలో స్క్రబ్ టైఫస్' జ్వరాల వలన మరణాలు సంభవించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వైద్య ఆరోగ్యశాఖను సమన్వయం చేసుకుంటూ పంచాయతీ, రెవెన్యూ శాఖలు ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్క్రబ్ టైఫస్' జ్వరాల నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలు, హౌసింగ్ , ఉపాధి హామీ పథకం పనులు, గ్రామ వార్డు సచివాలయ సేవలు తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పీహెచ్సీ వైద్యులు. ఎంపీడీవోలు,



తహశీల్దార్లు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా .. 2లో..

## ఏఆర్‌టి కేంద్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం

**పల్నాడు జిల్లా, నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** హెచ్ఐవి/ ఎయిడ్స్ రోగుల పట్ల ఉత్తమ సేవలు అందించినందుకు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో పల్నాడు జిల్లా నరసరావుపేట ఏఆర్ టి కేంద్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రం లో ఈ పురస్కారని డిసెంబర్ 1 న ప్రపంచ ఎయిడ్స్ డే 25 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె నీలకంఠ రెడ్డి గారు పల్నాడు జిల్లా



నరసరావుపేట ఏఆర్‌టి కేంద్రంలో పనిచేసే డాక్టర్ శారదకి బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి మాట్లాడుతూ గత ఏడాది ఉత్తమ పనితీరు కనబరించినందుకు గాను పల్నాడు జిల్లా నరసరావుపేట మిగతా .. 2లో..

## నిర్ణీత లక్ష్యాలతో..

# తెలంగాణ ముందుకెళ్తోంది..

### - గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిర్ణీత లక్ష్యాలు నిర్దేశించుకొని తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలన్నదే లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. సదస్సు ప్రాంగణంలో తెలంగాణ తల్లి డిజిటల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మిగతా .. 2లో..

## నరసరావుపేటలో హెరిటేజ్ మిల్క్ ప్రొడక్ట్స్

# నూతన ఔట్‌లెట్ ప్రారంభం

### ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



**పల్నాడు జిల్లా, నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో హెరిటేజ్ ఫ్రెష్ మిల్క్ & మిల్క్ ప్రొడక్ట్స్ నూతన వ్యాపార కేంద్రం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరై, రిబ్బన్ మిగతా .. 2లో..

# తెలంగాణా రైజింగ్ అన్‌స్టాపబుల్

### తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్త రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2047కు సరికొత్త లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నామ న్నారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగా లనేదే తమ ఆశయమన్నారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న ' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభో త్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలు, అభిప్రాయాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలనేది తమ ఆశయమన్నారు.

**గ్వాంగ్‌డాంగ్ నమూనా అమలు చేయదలిచాం..**

"లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడి సాధిస్తామనే నమ్మకం మాకుంది. అందరి సహకారంతో మా లక్ష్యాన్ని అందుకుంటాం. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో మిగతా .. 2లో..

## (మొదటిపేజీ తరువాయి)

## ఇండిగో వ్యవహారం..

పట్టించుకోకుండా ముందుకెళ్లాలని సూచించారు. ఇండిగో వ్యవహారంపై మంత్రి రామ్మోహన్‌నాయుడు.. ఎప్పటికప్పుడు ప్రధాని కార్యాలయానికి సమాచారం పంపినట్లు తెలిసింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను నవంబర్ 1 నుంచి అమలు చేస్తున్నట్లు డీజీసీఏకు, పౌరవిమానయాన శాఖకు ఇండిగో సమాచారం ఇచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 1 వరకు కార్యకలాపాలన్నీ సజావుగానే ఉన్నాయని, డిసెంబర్ 3 నుంచి సమస్యలు వచ్చాయని అన్నారు. ఇది పూర్తిగా యాజమాన్య తప్పిదమేనని, కచ్చితంగా ఆ సంస్థపై చర్యలు ఉంటాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇండిగో వద్ద 2260 మంది పైలట్లు ఉన్నారని అధికారులు చెబుతున్నారు. షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ గడువు కోరారని, ఆయన నుంచి సమాధానం వచ్చాక తదుపరి చర్యలు మొదలవుతాయని అధికారులు అంటున్నారు.

## సీఎం మార్పు ఊహాగానాల వేళ...

వరుణ అసెంబ్లీ నుంచి ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని పిటిషనర్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. హైకోర్టు ఉత్తర్వులను పిటిషనర్ సుప్రీంలో సవాల్ చేయగా.. ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఒకవైపు కర్ణాటకలో సీఎం మార్పుపై ఊహాగానాలు తీవ్ర స్థాయిలో చక్కర్లు కొడుతున్నాయి. సిద్ధూ స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పీఠం మీద కూర్చుంటారనే వార్తలు ఆగడం లేదు. ఈ నేపథ్యంలోనే సిద్ధూకు నోటీసులు వచ్చాయి. మరోవైపు ఇప్పటికే నేషనల్ హెరాల్డ్ కేసులో డీకే శివకుమార్‌కు ఈవోడబ్ల్యూ నోటీసులు జారీ చేసింది. ఆర్థిక విషయాలు, లావాదేవీలపై శివకుమార్ (%ణఖ రాష్ట్రఅఝుఎబఝితీ%) వివరణ కోరుతూ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 19లోపు వివరాలు సమర్పించాలని ఈవోడబ్ల్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై దిల్లీ పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే.

## వందేమాతరం వలే నెహ్రూపై చర్చ పెడదాం

ఎన్నికలను దృష్టిపెట్టుకొని ఈ చర్చకు తెరతీశారని ఆమె విమర్శించారు. "వందేమాతరం భారత ప్రజల మనసుల్లో మమేకమై ఉంది. ఇది మన జాతీయ గేయం. ఇప్పుడు మనం దీని గురించి ఎందుకు చర్చించుకుంటున్నాం..? ప్రజా సమస్యల నుంచి దేశాన్ని పక్కదారి పట్టించేందుకు, బెంగాల్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ చర్చను సిద్ధం చేశారు. ప్రజలు వర్తమానం, భవిష్యత్తును వదిలి, గతంలోకి చూడాలని ఈ ప్రభుత్వం కోరుకుంటోంది. ఈ దేశ ప్రజలు సంతోషంగా లేరు. వారిని ఎన్నో సమస్యలు వేధిస్తున్నాయి. కానీ ప్రభుత్వం వాటిని పరిష్కరించే దిశగా చర్చ జరపడం లేదు" అని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆమె వ్యాఖ్యలకు వ్యతిరేకంగా అధికారపక్ష సభ్యులు నినాదాలు చేశారు. అధికారపక్ష సభ్యులకు ప్రియాంక ఒక సలహా ఇచ్చారు. "మీరు నెహ్రూ గురించి మాట్లాడుతూనే ఉన్నారు. కాబట్టి మనం ఒక పనిచేద్దాం. అందుకోసం సమయం కేటాయించుకుందాం. ఆయన గురించి మీరు మాట్లాడాలనుకున్న అంశాలన్నీ ఒక జాబితా చేద్దాం. వాటిపై చర్చిద్దాం. ఇక ఛాప్టర్‌ను అక్కడితో ముగిద్దాం. ప్రజా సమస్యలు గురించి కాకుండా.. ఇప్పుడు మనం వందేమాతరం గురించి చర్చిస్తున్నట్టుగా నెహ్రూ గురించి చర్చించుకుందాం" అని సూచించారు.

## చైనా ప్రయాణాల విషయంలో జాగ్రత్త..

వేధింపులు ఎదురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా సూచనలు జారీ చేసింది. "చైనా విమానాశ్రయాల మీదుగా రాకపోకలు సాగించే భారతీయులను లక్ష్యంగా చేసుకోబోమని చైనా హామీ ఇస్తుందని ఆశిస్తున్నాం. ఏకపక్షంగా నిర్బంధించడం, వేధించడం వంటి పనులను మానుకుంటుందని, అదేవిధంగా అంతర్జాతీయ విమాన ప్రయాణ నిబంధనలను గౌరవిస్తుందని భావిస్తున్నాం. చైనా ప్రయాణాల విషయంలో భారతీయులు జాగ్రత్తగా వ్యవహరించాలి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ తెలిపారు.

**ఏం జరిగిందంటే..**

గత నెలలో పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. ట్రాన్సిట్ హాల్ట్ కోసం అది చైనాలోని షాంఘైలో దిగింది. అక్కడ తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని ఆమె చెప్పారు. పుట్టిన రాష్ట్రం పేరు అరుణాచల్ ప్రదేశ్ చూసి.. తన పాస్‌పోర్ట్ చెల్లదని ప్రకటించినట్లు ఆరోపించారు. స్థానిక భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే తనకు సాయం అందిందని సోషల్ మీడియా వేదికగా తెలిపారు.

**భారత్‌తో బలమైన బంధంతోనే.. చైనాపై ఆధిపత్యం..!**

ఈ ఘటనను భారత్ ఇప్పటికే తీవ్రంగా ఖండించింది. అరుణాచల్ ప్రదేశ్ ముమ్మాటికీ భారత్‌లో భాగమేనని, అక్కడి నివాసితులు భారత పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండేందుకు, ప్రయాణించేందుకు పూర్తిగా అర్హులని పేర్కొంది. మరోవైపు.. ఆమెకు ఎలాంటి వేధింపులు, నిర్బంధ చర్యలు ఎదురుకాలేదని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావో నింగ్ చెప్పడం గమనార్హం. అక్కడితో ఆగకుండా.. జాంగ్నాన్ (అరుణాచల్‌కు చైనా పేరు) ఎల్లప్పుడూ తమ భూభాగమేనని నోరుపారేసుకున్నారు.

### అది తీవ్రమైన అంశమే కానీ..

## అత్యవసర విచారణ చేయబోం..

పరిష్కారానికి ప్రభుత్వం సకాలంలో చర్యలు ప్రారంభించిందని మా దృష్టికి వచ్చింది" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. గత కొన్ని రోజులుగా ఇండిగో తన సర్వీసులు రద్దు చేస్తోందని, దాంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంతరాయాల గురించి ప్రయాణికులకు సమాచారం ఇవ్వలేదన్నారు. కాగా, డిసెంబర్ 2న మొదలైన ఇండిగో సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతోంది. దాంతో ఇటు ప్రయాణికులు, అటు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ సంస్థ తీవ్ర స్పందనను ఎదుర్కొంటోంది. విమానయాన సిబ్బంది పని గంటలపై పరిమితులు (ఫ్లైట్ డ్యూటీ టైం లిమిటేషన్స్-ఎఫ్‌డీటీఎల్) విధిస్తూ 2024 జనవరిలో జారీ చేసిన నిబంధనలను ఈ నవంబరు 1 నుంచి అన్ని విమానయాన సంస్థలు సరిగా అమలుచేసినప్పటికీ ఒక్క ఇండిగోతోనే సమస్య వచ్చిందని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఆ సంస్థ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడమే దీనికి కారణమన్నారు. ప్రయాణికులను ఇబ్బందిపెట్టిన ఇండిగో తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు.

## అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో చిగ్గర్ మైట్ (కీటకం) ప్రభావం కుట్టడం వల్ల స్క్రబ్ టైఫస్' జ్వరాల వస్తాయని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ జ్వరాలు నమోదు అవుతున్న, ప్రస్తుతం దీని వలన తీవ్ర అనారోగ్యం, మరణాలకు దారి తీస్తుందని అని చెప్పారు. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూముల పక్కనే నివసించే వారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని, చిన్న నల్ల మచ్చ (దద్దురు మాదిరిగా) శరీరంపై కనిపించి, జ్వరం వచ్చినట్లయితే స్క్రబ్ టైఫస్ గా అనుమానించవచ్చునని తెలిపారు. జ్వరం వచ్చి మూడు రోజుల వరకు తగ్గకుంటే జీ జీ హెచ్ కు వచ్చి రక్త పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ జ్వరాలకు ఉపయోగించే మందులు ఉప ఆరోగ్య కేంద్రాల్లో (హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్క్రబ్ టైఫస్ జ్వరలపై పూర్తిస్థాయిలో ప్రజలు అవగాహన కలిగించేలా గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించిన విధంగా నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ అధికారులు నిరంతరం పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణానికి సంబంధించి గతం లో లే అవుట్లలో ఆప్షన్ 3లో ఇళ్ళు నిర్మించిన కాంట్రాక్టర్ల పనులను పరిశీలించి డీవియేషన్లు ఉంటే వాటిని సరిచేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించని కాంట్రాక్టర్లపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద 3డీ మోడల్ లో గృహాల నిర్మాణానికి అనువుగా ఉన్న లేఔట్లను గుర్తించాలన్నారు, ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన పశువుల పాకలు వచ్చే వారం నాటికి నూరు శాతం గ్రౌండ్ చేసి డిసెంబర్ 15 నాటికి పూర్తి అయ్యేలా ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో జరిగే సర్వేల రోజువారీ వివరాల డైరీ సచివాలయ ఉద్యోగులు నిర్వహించేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు అందిచే పీజీఆర్ఎస్ అర్జీల ఎండార్స్మెంట్ లపై ఉద్యోగి పేరు , సచివాలయం వివరాల రబ్బర్ స్టాంప్ వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయల ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు శాతం మెరుగుపరిచేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. విజయలక్ష్మి మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ జ్వరాల లక్షణాలు, చికిత్స, అనుసరించాల్సిన ఇతర పద్ధతులను వివరించారు. పొలం పనులకు వెళ్లే వారు రబ్బరుతో తయారుచేసే షూలు ధరిస్తే మంచిదని, పాత మంచాలు, పరుపులు, దిండ్లు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవడం మంచిదన్నారు, నివాసం ఉండేచోట ఎలుకలు సంచరించకుండా చూసుకోవాలన్నారు.నేలపై నిద్రించే సమయంలో దుప్పట్లు ఉపయోగించాలన్నారు. రాత్రి వేళల్లో ఒంటిని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించటం తదితర ముందస్తు జాగ్రత్త చర్యలను పాటించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వి జ్యోతి బసు , సీపిఓ శేషశ్రీ, జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడి శంకర్ పాల్గొన్నారు.

## ఏఆర్‌టి కేంద్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం

ఏఆర్ టి కేంద్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం లభించింది అని చెప్పడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను జిల్లా లో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని చెప్పడం జరిగింది. జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం అందుకున్న నరసరావుపేట ఏఆర్ టి సిబ్బంది నీ , జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది నీ ఈ సందర్భంగా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా లె ప్ర సి ఎయిడ్స్ మరియు టిబి అధికారి డాక్టర్ మాధవి లత, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది,ఏర్ టి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ ముందుకెళ్తోంది..

సినీనటుడు నాగార్జున తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ.. మహిళా రైతులను పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. " బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చాం. వికసిత్ భారత్ దిశగా వేగంగా తెలంగాణ అడుగులు వేస్తోంది. మాది.. స్థిరమైన, పారదర్శక ప్రభుత్వం. ఆవిష్కరణల్లో అన్ని రాష్ట్రాలకంటే ముందున్నాం, విమానాశ్రయాలు, రైల్వేలు, రోడ్ల విస్తరణ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నాం" అని గవర్నర్ పేర్కొన్నారు.

**వికసిత్ భారత్ లక్ష్యం దిశగా తెలంగాణ: కైలాస్ సత్యార్థి**

తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని నోబెల్ బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి అన్నారు. 20 లక్షల మంది రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించిందన్నారు. ఫ్యూచర్‌సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా ఈ రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూ మార్గంలో రేవంత్ రెడ్డి పాలన నడుస్తోందని కితాబిచ్చారు.

తెలంగాణలో ట్రంప్‌మీడియా టెక్నాలజీస్ భారీ పెట్టుబడులు

**హైదరాబాద్, నేటి వార్త :** తెలంగాణలో ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఫ్యూచర్‌సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమిట్ వేదికగా సంస్థ డైరెక్టర్ ఎరిక్ ఈ మేరకు ప్రకటించారు. వచ్చే పదేళ్లలో రూ.లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు.

**తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధం: సీఐఐ మాజీ ఛైర్మన్**

ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరం ఆలోచన అభినందనీయమని సీఐఐ మాజీ ఛైర్మన్ దినేశ్ అన్నారు. తెలంగాణ ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలను ఒకే వేదికపైకి రప్పించడం గొప్ప విషయమని, తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

**రూ.25వేల కోట్లతో గ్రీన్ డేటా సెంటర్: కరణ్ అదానీ**

తెలంగాణ విజన్‌ను ఈ సమిట్ ప్రతిబింబిస్తోందని అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఎండీ కరణ్ అదానీ అన్నారు. తెలంగాణలో ఇప్పటికే అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టిందని చెప్పారు. " గ్రీన్ డేటా సెంటర్స్, రెన్యువబుల్ ఎనర్జీలో ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్నాం. సిమెంట్ రంగంలో కూడా అదానీ గ్రూప్ పెట్టుబడులు పెడుతోంది. డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. దేశంలో తొలిసారిగా యూఏవీ టెక్నాలజీ హైదరాబాద్‌లో రూపొందిస్తున్నాం. హైదరాబాద్‌లో తయారయ్యే యూవీలను సైన్యానికి అందిస్తాం. ప్రపంచమార్కెట్‌లోనూ విక్రయిస్తాం. రూ.25వేల కోట్లతో 48 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తాం. లాజిస్టిక్స్‌లో రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నిస్తోంది. రూ.4వేల కోట్లతో రహదారి సౌకర్యాలు కల్పించనున్నాం. రాష్ట్రంలో జిల్లాలను కలిపే రహదారులను అదానీ గ్రూప్ నిర్మిస్తోంది. రూ.2వేల కోట్లతో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసింది" అని కరణ్ అదానీ పేర్కొన్నారు.

## తెలంగాణా రైజింగ్ అన్‌స్టాపబుల్

తెలంగాణ కల సాకారమైంది. దేశంలోనే తెలంగాణ కొత్త రాష్ట్రం. దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నా.. 5 శాతం ఆదాయం ఇస్తున్నాం. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించాం. వాటిని సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించాం. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నాం. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తిగా ముందుకెళ్తున్నాం. అది 20 ఏళ్లలోనే అత్యధిక పెట్టుబడులు సాధించింది. ఇక్కడ కూడా గ్వాంగ్‌డాంగ్ నమూనా అమలు చేయదలిచాం. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ మాకు ఆదర్శం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## నూతన ఔట్‌లెట్ ప్రారంభం

కట్ చేసి ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ వంటి ప్రముఖ సంస్థలు నరసరావుపేటలో కొత్త బ్రాంచ్‌లు ప్రారంభించడం పట్టణ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు సులభంగా అందేలా చేస్తుందని, ఇది స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా పెంచుతుందని పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో హెరిటేజ్ సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొత్త ఔట్‌లెట్ ప్రారంభం సందర్భంగా హెరిటేజ్ తరపున ఆకర్షణీయమైన ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 2025-26 రెండో త్రైమాసికంలో 11.28 శాతం జీఎస్డీపీ వృద్ధి నమోదు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ..."విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. ప్రతీ త్రైమాసికం, ఆర్థిక సంవత్సరంలో సాధిస్తున్న రాష్ట్ర స్థూల ఉత్పత్తిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. ఛిన్నాభిన్నమైన వ్యవస్థను సరి చేయడం చేత కాదని పారిపోవటం లేదు... రాష్ట్రాన్ని పరుగులు పెట్టించేలా చూస్తున్నాం. ప్రజల కోసం ఎంత కష్టమైనా సరే బాధ్యత తీసుకుని అభివృద్ధి చేస్తాం. కూటమిపై ఉన్న నమ్మకం, విశ్వాసంతోనే భారీస్థాయిలో ప్రజలు మద్దతు పలికారు. ప్రజలు సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశారు. ఆస్తులను, భవిష్యత్ ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి గతంలో అప్పులు తెచ్చారు. మూలధన వ్యయం చేయకపోవటంతో గతంలో ఎక్కడా ప్రాజెక్టులు ముందుకు వెళ్లలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని ముందుకు తీసుకెళ్లగలిగాం. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రాజెక్టులపై మూల ధన వ్యయాన్ని గణనీయంగా పెంచి ప్రాజెక్టులు చేపట్టాం. సుపరిపాలన ద్వారా ప్రజల వద్దకు వెళ్లాం, వాట్సప్ గవర్నెన్సు ద్వారా ప్రజల చేతుల్లోకి పాలనను తీసుకెళ్లాం. డీఫంక్ట్ అయిన వివిధ కేంద్ర పథకాలను మళ్లీ పునరుద్ధరించాం. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను మళ్లీ రివైవ్ చేయగలిగాం. గత పాలకులు పీక్ లోడ్ సమయంలో బహిరంగ మార్కెట్ లో విద్యుత్ ను యూనిట్ కు రూ.15 చొప్పున కొనుగోలు చేసిన పరిస్థితి. పీపీఎల రద్దుతో విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది. కక్ష పూరిత రాజకీయాలతో గత పాలకులు ప్రజాధనానికి నష్టం కలిగించారు. ఈ వ్యవస్థలన్నీ గాడిలో పెట్టి ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ముందుకు వెళ్తున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచకుండా వ్యవస్థలను నిలబెట్టి ముందుకు తీసుకెళ్తున్నాం. సమర్ధవంతమైన సాగునీటి వ్యవస్థను కూడా చేపట్టాం. తద్వారా 950 టీఎంసీల నీరు రిజర్వాయర్లలో నిల్వ ఉంది. ఏపీ బ్రాండ్ పునరుద్ధరించాం. క్రమంగా పెట్టుబడులు వస్తున్నాయి."అని ముఖ్యమంత్రి అన్నారు.

**వారసత్వంగా అప్పులే కాదు... చెత్త కూడా ఇచ్చారు**

"రూ. 13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్నాం. ఎస్ఐపీబీల ద్వారా రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులకు పైగా ఆమోదం తెలియ చేశాం. విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు... ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సంస్కరణలు తీసుకువచ్చాం. గత పాలకులు విద్య శాఖలోనూ బిల్స్ పెండింగ్ పెట్టారు. పల్లె పండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చి వెళ్లారు. చెత్తను తొలగించడానికే ఎక్కువ సమయం పడుతోంది. జనవరి 1 నాటికి ఎక్కడా చెత్త లేకుండా చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకూ అవగాహన రావాల్సిన అవసరం ఉంది. జీవన ప్రమాణాలు పెరగాలంటే... జీఎస్డీపీ పెరగాలనే అంశం ప్రజలకు తెలియాల్సి ఉంది. విభజన వల్ల రాష్ట్రానికి వ్యవస్థీకృతమైన నష్టం జరిగింది. 2019-24 లో జరిగిన పాలన వల్ల వ్యవస్థలు డీఫంక్ట్ అయ్యాయి. రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయింది. గత పాలకుల విధ్వంస పాలన వల్ల గ్రోత్ రేట్ తగ్గి రూ. 7 లక్షల కోట్ల జీఎస్డీపీ కోల్పోయాం. గ్రోత్ రేట్ లేకపోవటం వల్ల రూ. 76,195 కోట్ల ఆదాయం కోల్పోయాం. గత ప్రభుత్వంలో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవటం వల్ల ప్రజాధనానికి నష్టం కలిగింది. రుణాల రీ-షెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రాష్ట్రానికి బ్రాండ్ తగ్గితే బ్యాంకులు ఎక్కువ వడ్డీలు చెల్లించాలని డిమాండ్ పెడతాయి. దీని ద్వారా రెవెన్యూ జీఎస్డీపీలో రాష్ట్రం చాలా నష్టపోయింది. ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెంచాలన్నదే ఎప్పుడూ నా ఆలోచన."అని సీఎం వివరించారు.

**అభివృద్ధికి బాటలు వేస్తున్నాం..**

"25 ఏళ్ల క్రితం రూపొందించిన పాలసీల కారణంగా తెలంగాణా రాష్ట్రం ఇప్పుడు ఆదాయం సాధిస్తోంది. తెలుగు రాష్ట్రాలు ఎప్పుడూ అభివృద్ధి సాధించాలని ట్వీట్ చేశాను. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, విద్యుత్ సహా వివిధ మౌలిక సదుపాయాలు కల్పించటం వల్ల పరిశ్రమల రంగంలో వృద్ధి నమోదైంది. రాష్ట్రంలో నీటి భద్రత, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వ్యయం తగ్గింపు, ప్రొడెక్టు పర్ఫెక్షన్, డీప్ టెక్ లాంటి 10 సూత్రాలను సమర్ధంగా అమలు చేస్తున్నాం. వెంటిలేటర్ లో ఉన్న రాష్ట్రానికి తిరిగి ఊపిరి పోయగలిగాం. 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ ఏడాది కొనుగోలు చేస్తున్నాం. ప్రజలు తినే ఆహారానికి అనుగుణంగా పంటలను పండించటం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుంది. దీనిపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఉద్యాన, ఆక్వా కల్చర్ రంగాలను కూడా మరింతగా ప్రోత్సహిస్తున్నాం. సమీకృత వ్యవసాయం ఇప్పుడు కీలకమైన అంశంగా మారింది. బిల్ గేట్స్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలో అగ్రిటెక్ అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో రైతు సేవా కేంద్రం వారీగా వ్యవసాయ యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నాం. ప్రకాశం సహా 9 రాయలసీమ జిల్లాల్లో ఉద్యాన క్లస్టర్ గా తయారు చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

2025-26 ఆర్థిక సంవత్సరంలోని రెండో త్రైమాసికంలో 11.28 శాతం జీఎస్డీపీ వృద్ధిరేటు

2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో త్రైమాసికానికి సంబంధించిన రాష్ట్రస్థూల ఉత్పత్తి, గ్రాస్ వాల్యూ అడిషన్ సహా వివిధ గణాంకాలను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఆ గణాంకాల వివరాలు ఇవీ..

రెండో త్రైమాసికం ప్రస్తుత ధరల్లో రాష్ట్ర జీఎస్డీపీ మొత్తంగా 11.28 శాతం వృద్ధి నమోదు.

రూ.4,00,377 కోట్ల విలువైన జీఎస్డీపీ నమోదు. ఇదే సమయానికి భారతదేశ జీడీపీ 8.7 శాతంగా ఉంది.

గత ఏడాది 2వ త్రైమాసికంలో రాష్ట్ర జీఎస్డీపీ 10.17 శాతంగా ఉంది. దీని విలువ రూ.3,59,778. అంటే ఈ త్రైమాసికంలో జీఎస్డీపీ గత ఏడాదితో పోల్చుకుంటే 1.11 శాతం పెరిగింది.

2వ క్వార్టర్‌కి రాష్ట్ర జీవీఏ 11.30 శాతం ఉండగా, జాతీయ జీవీఏ 8.7 శాతంగా నమోదైంది.

రాష్ట్రంలో వ్యవసాయ-అనుబంధ రంగాల జీవీఏ 10.70 శాతం , పరిశ్రమల రంగం 12.20 శాతం, సేవల రంగం 11.30 శాతం వృద్ధి నమోదైంది.

జాతీయ స్థాయిలో జీవీఏ వృద్ధి చూస్తే వ్యవసాయ రంగం 1.8 శాతం, పరిశ్రమల రంగం 8.5 శాతం, సేవల రంగం 10.6 శాతంగా ఉంది.

**వ్యవసాయం-అనుబంధ రంగాలు:**

ఈ త్రైమాసికంలో వ్యవసాయం-అనుబంధ రంగాల్లో జీవీఏ విలువ రూ.1,25,571 కోట్లు, పరిశ్రమల రంగం విలువ రూ.86,456 కోట్లు, సేవల రంగం విలువ రూ.1,60,075 కోట్లు.

పరిశ్రమల రంగంలో అనూహ్య ప్రగతి వచ్చింది. 2.78 శాతం నుంచి 12.20 శాతానికి వృద్ధి పెరిగి... జాతీయ సగటును దాటింది.

వ్యవసాయ రంగంలో 11.43 శాతం, హార్టీకల్చర్ 4.35 శాతం, ఫిషింగ్, ఆక్వాకల్చర్ రంగాల్లో 26.27 శాతం, లైవ్ స్టాక్‌లో 4.18 శాతం వృద్ధి రేటు సాధించాం.

వరి 3.64 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా... గతంతో పోలిస్తే 23.95 శాత మేర వృద్ధి వచ్చింది.

అరటిలో అనూహ్యంగా 37.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. గతంతో పోలిస్తే ఇది 151.2 శాతం అధికం. మత్స్య దిగుబడి 17.30 శాతం, రొయ్యలు 27.09 శాతం మేర పెరిగింది.

గుడ్లు 6.68 శాతం, మీట్ 7.95 శాతం పెరగ్గా... పాల దిగుబడి 3.62 శాతం తగ్గింది.

**పరిశ్రమల రంగం :**

పరిశ్రమల రంగానికి వచ్చే సరికి మొత్తంగా 12.20 శాతం వృద్ధి నమోదుకాగా... ఇందులో మైనింగ్-క్వారింగ్‌లో 18.43 శాతం పెరిగింది.

తయారీ రంగంలో రూ.41,201 కోట్ల విలువైన జీవీ నమోదు కాగా 11.66 శాతం పెరుగుదల ఉంది. నిర్మాణం రంగంలో కూడా పురోగతి వచ్చింది. 11.81 శాతం పెరుగుదలతో జీవీఏ రూ.28.625 కోట్లకు చేరింది.

విద్యుత్ ఉత్పత్తిలో 19.12 శాతం వృద్ధి నమోదైంది. 26,837 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరుకుంది. అలాగే విద్యుత్ వినియోగం కూడా 4.17 శాతం పెరిగింది.

**సేవల రంగం :**

ఆతిధ్య రంగంలో రూ.25,292 కోట్ల విలువైన జీవీఏతో 8.50 శాతం వృద్ధి నమోదైంది. ఈ రంగంలో ట్రేడ్, మాల్స్, రెస్టారెంట్లలో 6.95 కోట్ల ఫుట్ ఫాల్.

రవాణా, గిడ్డంగులు తదితర విభాగాల్లో రూ.24,927 కోట్ల జీవీఏతో 5.99 శాతం వృద్ధి. 21.55 లక్షల వాణిజ్య వాహనాల రిజిస్ట్రేషన్ జరిగాయి.

జల రవాణా ద్వారా 52.50 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ జరిగింది. అలాగే ఈ త్రైమాసికంలోనే 14.98 లక్షల మంది విమానాల్లో ప్రయాణించారు.

రియల్ ఎస్టేట్ రంగంలో రూ.32,951 కోట్లతో 14.31 శాతం పెరుగుదల నమోదు.

2014-19, 2019-24 మధ్య వృద్ధిలో వ్యత్యాసం

2014-19 మధ్య జీఎస్డీపీ వృద్ధి 13.49 శాతంగా నమోదు కాగా... 2019-24 మధ్య జీఎస్డీపీ 10.32 శాతానికి పడిపోయింది.

మళ్లీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ఏడాది 2024-25లో రూ.15.93 లక్షల కోట్లతో 12.02 శాతానికి జీఎస్డీపీ పెరిగింది. అదే సమయానికి జాతీయ జీడీపీ వృద్ధి 9.8 శాతంగా ఉంది.

2019-24 మధ్య వృద్ధి రేటు పడిపోవడంతో రూ.7 లక్షల కోట్ల జీఎస్డీపీ రాష్ట్రం నష్టపోయింది. 2014-19 వృద్ధి రేటు తర్వాత కాలంలోనూ కొనసాగి ఉంటే అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చి ఉండేది.

తలసరి ఆదాయంలో కూడా ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపించింది. 2014-2019 మధ్య 13.21 శాతం పెరగ్గా... 2019-24 మధ్య 9.8 శాతం మాత్రమే పెరిగింది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో 11.89 శాతం మేర తలసరి ఆదాయంలో పెరుగుదల నమోదైంది.

రాష్ట్రంలో తలసరి ఆదాయం 2018-19లో రూ.1,54,031 ఉండగా, 2023-24 నాటికి రూ.2,37,951కి మాత్రమే పెరిగింది. 2024-25 కల్లా ఇది రూ.2,66,240కి తీసుకువచ్చాం. ఇదే సమయంలో జాతీయ తలసరి ఆదాయం రూ.2,05,324గా ఉంది.

2014-19 మధ్య నమోదైన 13.49 శాతం వృద్ధి రేటు కొనసాగితే... స్వర్ణాంధ్ర-2047 లక్ష్యం నాటికి రూ.292 లక్షల కోట్ల జీఎస్డీపీ, రూ.49 లక్షల తలసరి ఆదాయం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

అదే 15 శాతం వృద్ధి నమోదైతే 25 రెట్లకు జీఎస్డీపీ పెరిగి రూ.396 లక్షల కోట్ల విలువకు చేరుకుంటుంది. తలసరి ఆదాయం కూడా రూ.66 లక్షలు అవుతుందని అంచనా.

**2025-26 తొలి అర్థ సంవత్సరం ఫలితాలు :**

ప్రస్తుత ధరల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్థ సంవత్సరం రాష్ట్ర జీఎస్డీపీ రూ.7,58,270 కోట్లు కాగా... జీవీఏ విలువ మొదటి రూ.7,03,767 కోట్లుగా ఉంది.

వ్యవసాయ రంగంలో 10.26 శాతం వృద్ధితో రూ.2,07,073 కోట్లుగా నమోదన జీవీఏ.

పరిశ్రమల రంగంలో 12.05 శాతం వృద్ధితో రూ.1,79,299 కోట్లుగా నమోదన జీవీఏ.

సేవల రంగంలో 11 శాతం వృద్ధితో రూ.3,17,396 కోట్లుగా నమోదన జీవీఏ.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 09 డిసెంబర్ 2025




www.viswamvoice.com

# తృటిలో తప్పిన పెను ప్రమాదం...



## గ్యాస్ ఏజెన్సీల నిర్లక్ష్య వైఖరి ... - అధికారుల పర్యవేక్షణ లోపం...

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం పరిధిలో కొండపల్లి వారి గుడి వద్ద పెను ప్రమాదం తప్పింది. వంట గ్యాస్ కనెక్షన్ పైప్ కరిగి భారీగా మంటలు చెలరేగడంతో మహిళ కాలుకి తీవ్ర గాయాలు అయ్యాయి. కొండపల్లి వారివీధి అమ్మవారి గుడి సమీపంలో వంట గదిలో వంట చేసుకునే సమయంలో గ్యాస్ పైప్ కనెక్షన్ కరిగి భారీగా మంటలు చెలరేగడంతో మహిళ కాలిన గాయాలతో ఇంటి నుండి బయట పడింది స్థానికులు హుటాహుటిన ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. స్థానికులు మాట్లాడుతూ మంటలు అదుపు చేయడం వల్ల భారీ ప్రమాదమే తప్పింది అని అన్నారు.

గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు ఇంటికి వెళ్లి ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సంబంధిత గ్యాస్ ఏజెన్సీ వారు తమ పరిధిలో ఉన్న కనెక్షన్ లను పూర్తిస్థాయిలో పరిశీలించి పూర్తి సామర్థ్యంతో ఉన్నదని ధ్రువపత్రాన్ని జారీ చేయాల్సి ఉంటుంది అలా జారీ చేస్తే ఇటువంటి ప్రమాదాలు జరగవు అని అక్కడ మహిళలు చెబుతున్నారు. కానీ కరోనా కు ముందు ఎప్పుడో పరిశీలించారు తప్ప ఇప్పటివరకు ప్రతి కనెక్షన్ ను పూర్తిస్థాయిలో తనిఖీలు చేసిన దాఖలాలు లేవని సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని దీనిని పూర్తిస్థాయిలో సంభందిత రెవెన్యూ డివిజన్ అధికారులు దృష్టి సారించి స్వయంగా తనిఖీలు చేస్తే గ్యాస్ ఏజెన్సీ లు మేలుకుని ప్రమాదాల భారీ నుండి ప్రజలను కాపాడినవారవుతారని అక్కడ మహిళలు ముక్తకంఠంతో చెబుతూ డిమాండ్ చేస్తున్నారు.

గ్యాస్ కనెక్షన్ పొందిన ప్రతి వినియోగదారుడు వద్ద కచ్చితంగా ఎస్.వి. సర్టిఫికెట్ ఉంటే ప్రమాద భారిన పడిన వారికి నష్టపరిహారాన్ని పొందే అవకాశం వస్తుందని కాని అటువంటి విషయాన్ని ప్రజలకు తెలియపర్చకపోవడం గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నట్లుంది.





గతంలో గ్యాస్ ఏజెన్సీ వాళ్ళు ప్రతి ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేసేవారు నేడు అలాంటిది రాను రాను అక్కడక్కడ తనిఖీలు చేస్తూ 100 రూపాయిలు రుసుముతో ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తున్నారే కానీ పూర్తిస్థాయిలో తనిఖీలు చేయడం లేదు. ఎస్.వి. సర్టిఫికెట్ వల్ల ప్రమాదం జరిగిన బాదితులకు నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందనే విషయం ప్రజలకు తెలియచేప్పే ప్రయత్నం అధికారులు తీసుకుంటే మంచిదని అన్నారు.

**యరమాటి వెంకన్నబాబు, పట్టణం వాసి...**

# మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని కలిసిన గండిపోశమ్మ ఆలయ ఈవో



**దేవిపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** గౌరవ భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతివర్యులువారు ఎం.వెంకయ్యనాయుడుని అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీపట్నం మండలం, గొందూరు గ్రామంలో గల స్వయంభూ మాతృశ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయ ఈవో కలిశారు. ఈ సందర్భంగా గండి పోశమ్మ అమ్మవారి ఆలయాన్ని పోలవరం ప్రాజెక్టు ముంపు బారి నుండి రక్షించి అభివృద్ధి చేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసి ప్రభుత్వం జీవో జారీ చేసిన సందర్భంగా దీనిపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా శ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గండి వెంకట లక్ష్మీ కుమార్, ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు ఎం.శ్రీనివాస రెడ్డిలను వెంకయ్యనాయుడు అభినందించారు.

# బ్లాక్ బెల్ట్‌లో గోల్డ్ మెడల్ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన పునుగుపాటి అనన్య

## అభినందనలు తెలిపిన పాఠశాల యాజమాన్యం



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** కరాటే ఛాంపియన్ 2025 తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జరిగే పోటీల్లో ఎటపాక మండలం నందిగామ గ్రామానికి చెందిన పునుగుపాటి అనన్య జిల్లాలో బ్లాక్ బెల్ట్ సాధించి గోల్డు మెడల్ పొందారు. మండలంలోనీ శ్రీ ఆదిత్య పాఠశాల లో ఎనిమిదవ తరగతి చదువుతున్నది. పాఠశాల యాజమాన్యం విద్యతో పాటు శిక్షణ కనబరిచారు. దీంతో కరాటే పోటీల్లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన అనన్యకు పాఠశాల యాజమాన్యం, మండల ప్రజానీకం అభినందనలు తెలిపారు.

# లోకేష్, రామ్మోహన్ ఎదుగుదలను ఓర్వలేకనే రాద్ధాంతం

## విమానయాన సంక్షోభం త్వరలో పరిష్కారం : టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల దేశంలో ఏర్పడిన విమానయాన సంస్థ సంక్షోభం క్రమక్రమంగా తగ్గుముఖం పడుతోందని, ఈ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. విమానయాన సమస్యపై యువనేత నారా లోకేష్ కేంద్రానికి సూచనలు చేయడంపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు.

**విమాన సేవలు మెరుగుపడుతున్నాయి**

విమానయాన సంస్థలో ఏర్పడిన సంక్షోభం గురించి రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ,"ఆదివారం ఆ సంస్థ 650 విమానాలను నడిపింది. రద్దయిన విమానాల సంఖ్య శనివారం 800 ఉంటే, అది ఆదివారానికి 650కి తగ్గింది. పరిస్థితి నెమ్మదిగా గాడిన పడుతూ వస్తుంది. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది, ఏ విధమైన ఆందోళన చెందవలసిన అవసరం లేదు," అని తెలిపారు.

**లోకేష్, రామ్మోహన్ నాయుడు ఎదుగుదలపై వైసీపీకి కన్నుకుట్టింది**

యువనేత నారా లోకేష్ మరియు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుల సమర్థత, ఎదుగుదలను వైసీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని రెడ్డి సుబ్రహ్మణ్యం మండిపడ్డారు."కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని, అందులో తెలుగుదేశం పార్టీ భాగస్వామ్యంగా ఉందనే విషయం వైసీపీ నాయకులు తెలుసుకోవాలి.నారా లోకేష్ తెలుగుదేశం పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శి అన్న విషయం తెలుసుకోవాలి," అని ఆయన గుర్తు చేశారు.?నారా లోకేష్ జాతీయ సమస్యల పట్ల అవగాహన పెంచుకుని, సమస్య పరిష్కారం కోసం కేంద్ర దృష్టికి కొన్ని సూచనలు చేస్తే, వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని ఆయన ఖండించారు.

**రాజకీయ కోణంలో చూడొద్దు**

విమానయాన సంక్షోభంపై లోకేష్ తరపున అధికార ప్రతినిధి దీపక్ రెడ్డి మాట్లాడితే తప్పుబడుతున్నారని, దీపక్ రెడ్డి



మాట్లాడిందంతా కరెక్టేనని తాను కూడా సమర్థిస్తున్నానని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎదుగుదల చూడలేక పోతున్నారు.నారా లోకేష్ అతి తక్కువ కాలంలోనే జాతీయ నాయకులకు దగ్గరై సమస్యను పరిష్కరించడానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తుంటే ఇలా మాట్లాడుతున్నారు," అని విమర్శించారు. ఏదైనా సమస్య పరిష్కారం అవ్వాలంటే వైసీపీ తరపున మీరు సూచనలు ఇవ్వండి, స్వీకరిస్తాం. లేదంటే సమస్య పరిష్కరించే వారిని రాజకీయ కోణంలో చూడొద్దని" ఆయన హితవు పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో రామ్మోహన్ నాయుడు, యువనేత లోకేష్ అంచలంచెలుగా ఎదుగుతున్నారని, దీనిని రాజకీయ కోణంగా చూడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

**మద్యం కేసులో జోగి రమేష్‌కు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు**

మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జోగి రమేశ్ మద్యం అవినీతి కేసులో అడ్డంగా దొరికిపోయి రిమాండ్‌కు వెళ్లిన నేపథ్యంలో, ఆయనను సమర్థిస్తున్న వైసీపీ నాయకులకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం తీవ్ర సవాలు విసిరారు. జోగి రమేశ్ చేసిన తప్పును కులానికి ఆపాదించి మాట్లాడటం సిగ్గు చేటని ఆయన మండిపడ్డారు. రెడ్డి సుబ్రహ్మణ్యం మీడియాతో మాట్లాడుతూ "జోగి రమేశ్ మద్యం అవినీతి కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి రిమాండ్‌కు వెళ్లిన సంగతి రాష్ట్రంలో అందరికీ తెలుసు.ఇప్పుడు ఆ విషయాన్ని కొంతమంది వైసీపీ నాయకులు కులాన్ని అడ్డుపెట్టుకుని మాట్లాడుతున్నారు," అని అన్నారు. తప్పు చేసి ఆధారాలతో దొరికిపోయిన వ్యక్తి జోగి రమేశ్. కేవలం బీసీ కులంలో పుట్టినంత మాత్రాన వారిని రిమాండ్‌కు పంపించి శిక్షించడం సమంజసం కాదు అనడం కులానికి ఏమాత్రం సంబంధం లేదు. జోగి రమేశ్ 100 శాతం శిక్షార్హుడే," అని స్పష్టం చేశారు.

**బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు జోగి రమేష్‌కు లేదు**

జోగి రమేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనకు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని రెడ్డి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. “జోగి రమేశ్ జగన్‌మోహన్ రెడ్డి క్యాబినెట్‌లో ఉండగా బీసీల మీద అనేక అత్యాచారాలు, అఘాయిత్యాలు జరిగినా ఏనాడైనా బీసీల గురించి ఆలోచించాడా స్పందించాడా?” అని నిలదీశారు.సిగ్గు లేకుండా మద్యం కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళితే, వైసీపీ నాయకులు బీసీల గురించి మాట్లాడుతున్నారు. బీసీలతో పోలుస్తున్నారు. జోగి రమేశ్ బీసీలకు చేసింది ఏమిటి? వారికి దమ్ము, ధైర్యం ఉంటే వైసీపీ నాయకులు సూటిగా చెప్పాలి," అని సవాల్ విసిరారు

**డిబేట్‌కు రండి,మేము సిద్ధం:**

టీడీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు ఏం న్యాయం చేస్తుందో చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామని రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రకటించారు. “మేము తెలుగుదేశం పార్టీలో ఉండి బీసీలకు జరుగుతున్న అన్యాయాలను ఏ విధంగా వ్యతిరేకించాం, అధికారంలోకి వచ్చాక ఆ బీసీలకు ఏం న్యాయం చేస్తున్నాం చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నాం. డిబేట్‌కి ఎవరైనా వస్తే రండి, మేము సిద్ధంగా ఉన్నాం," అని ఆయన వైసీపీ నాయకత్వానికి సవాలు విసిరారు.

# దేవాలయాల్లో సేవ చేసుకునే అవకాశం కల్పించండి..

## కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గౌతమ్ బాబు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని, మరియు అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని ,అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన కీర్తిశేషులు పినపోతు గజేంద్రుడు , మరియు కీర్తిశేషులు కొపనాతి కృష్ణమ్మ ఆలయాలను నిర్మించి ప్రపంచ స్థాయిలోనే స్వామివారి కి గుర్తింపుని తీసుకొచ్చిన ఘనత ఆ మహనీయులది చెప్పుకోవడం లో ఎటువంటి సందేహం లేదు.అయితే అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి సంబంధించిన కొంత మంది వ్యక్తులను ట్రస్ట్ బోర్డులలో సేవ చేసుకొనుటకు ప్రభుత్వంఅవకాశం కల్పించాలని అంతర్వేది మహా గజమాల ఫౌండేషన్ తరపున సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కి వినతి పత్రాలను అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కొల్లు గౌతమ్ మరియు మహా గజమాల ఫౌండేషన్ సభ్యులు పాల్గొనడం జరిగినది.

# సోలార్ పరికరాలతో మీ ఆదాయం పొదుపు : కమీషనర్ రంగారావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** సోలార్ పరికరాలతో మీ ఆదాయం పొదుపు చేసుకోవచ్చని కమీషనర్ టివి రంగారావు పేర్కొన్నారు.మండపేట మున్సిపల్ కార్యాలయం లో సోమవారం కమీషనరు టి.వి.రంగారావు ఆద్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం పై మెప్మా సిబ్బంది ఆర్.పి ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశం లో సోలార్ ఎనర్జీ సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ప్రయోజనాలు, లోన్ ప్రాసెస్ లను వివరించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో అందిస్తున్న పి.ఎం. సూర్యఘర్ పథకాన్ని వార్డులో ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం వల్ల విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చుననే విషయం ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ ను అమర్చుకోవడానికి బ్యాంకులు తక్కువ వడ్డీతో ఋణలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. మెప్మా ఆర్.పి లు వార్డులలో ఈ పథకం పై విస్తృతంగా ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. సోలార్ రూఫ్ టాప్ అమర్చుకొనే విధంగా చూడాలన్నారు. బ్యాంకర్లు త్వరితగతిన వారికి ఋణాలు మంజూరు చేయాలని తెలిపారు. విద్యుత్ ను పొదుపు చేసి భవిష్యత్ తరాలకు విద్యుత్ ను మిగులుగా పొదుపు చేయాలని కోరారు. రాబోవు కాలంలో విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కోవాలంటే ప్రజలందరూ తప్పని సరిగా విద్యుత్ పొదుపు చేసి పూర్తి స్థాయిలో సోలార్ విద్యుత్ ను తయారు చేయు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజనీర్లు దాసరి పవన్ కుమార్, వివిధ బ్యాంకుల సిబ్బంది, మెప్మా సి.యం.యం సుజాత, సి.ఓ లు,ఆర్.పి.లు పాల్గొన్నారు.

# అవగాహన పెంపు ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం

## కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో 213 అర్జీలు స్వీకరణ : కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 213 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. రెవెన్యూ, సర్వే సంబంధిత అర్జీలు అత్యధికంగా వచ్చాయని పేర్కొన్నారు. ప్రజలు క్షేత్ర స్థాయిలో అర్జీలు సమర్పించేందుకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రీవెన్స్‌లో అందిన అర్జీలను శాఖాధిపతులు పర్యవేక్షణ లో పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టి సారించారు. తేమ శాతం పేరిట రైతులకు నష్టం కలగకుండా పరిశీలించాలని సూచించారు. యూరియా సరఫరా పుష్కలంగా అందుబాటులో ఉన్నందున రైతులకు సరైన సమాచారం ఇవ్వాలని రైతు సంక్షేమంపై అధికారులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో అందిన ప్రజా అర్జీలను వేగంగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని,



ఎంపీడీవోలు మరియు మున్సిపల్ కమిషనర్లు హాస్టళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆహార & పౌర సరఫరాలు, పోలీసు హోం వంటి శాఖలకి చెందిన అర్జీలు ఎక్కువగా వస్తున్నట్లు తెలిపారు. భూసంబంధిత సమస్యలు, రేషన్ సరఫరా, రోడ్లు, శానిటేషన్ వంటి అంశాలపై ప్రజలు ఎక్కువగా ఫిర్యాదులు చేశారనీ, ఆయా శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**శాఖల వారీగా అర్జీల వివరాలు:**

సోమవారం కలెక్టరేట్‌లో స్వీకరించిన 213 అర్జీలలో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 105 అర్జీలు అందగా, పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖకు 49, హోం శాఖకు 18, వినియోగదారుల వ్యవహారాలు%-%ఆహార& పౌర సరఫరాలకు 22, మున్సిపల్ పరిపాలనకు 7 అర్జీలు వచ్చాయి. వ్యవసాయం 5, పాఠశాల విద్య 4, ఎనర్జీ 3, హౌసింగ్ 2, నీటి వనరులు 2 అర్జీలు అందాయి. ఇతర శాఖలుపరిశ్రమలు, మహిళ & శిశు సంక్షేమం, అటవీ, జంతు సంరక్షణ తదితర శాఖలకు తక్కువ సంఖ్యలో అర్జీలు వచ్చి, మొత్తం 213 గ్రీవెన్స్‌లు నమోదు అయ్యాయి.

**కొన్ని అర్జీలు వివరాలు:**

సోమవారం పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన అర్జీలలో, రాజమండ్రికి చెందిన తోట వెంకట సౌందర్య కాతేరు గ్రామంలో ఇంటి స్థలం మంజూరు అయినట్లు రికార్డులలో ఉన్నప్పటికీ పట్టా పత్రాలు అందలేదని, వాటిని తన పేరుపై ఇవ్వాలని కోరగా, రూరల్ తహసిల్దార్ విచారణ నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తాళ్లపూడి కి చెందిన జె. అనంత సత్యవతి సర్వే నంబర్ 49/3లో ఉన్న 22 సెంట్ల భూమిని రీ సర్వేలో 19.60 సెంట్లుగా నిర్ధారించారని, తగు న్యాయం చేయాలని కోరడంతో, దానిపై పరిశీలన జరుగుతోంది. పోలవరంకి చెందిన కామిశెట్టి వెంకట దుర్గా రావు సర్వే నంబర్ 182/2లో ఉన్న 2.40 ఎకరాల భూమికి సంబంధించి, ఇతరులు తమ వ్యవసాయ భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని అర్జీ ఇవ్వగా, తహసిల్దార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. రంగంపేటకు చెందిన దయ్యాల లక్ష్మీ తన పెద్ద కుమారుడు, కోడలు ఇబ్బందులు పెడుతూ ఇంటి నుండి పంపివేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఆస్తి భూమి రాశారని, శిస్తు సొమ్ము ఇప్పించాలని కోరడంతో, మండల స్థాయి బృందం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డిఆర్వో టీ. సీతారామ మూర్తి, ఎస్డిసి ఎస్. భాస్కర్ రెడ్డి, పి. భాగ్యలక్ష్మీ, సీపీవో జాయింట్ డైరెక్టర్ ఎల్. అప్పల కొండ, డీఎస్పీ విద్య తదితరులు పాల్గొన్నారు.

# చట్టపరమైన బాధ్యతే కాక, ప్రాణాలను కాపాడే సాధనం హెల్మెట్

## మండపేట రూరల్ సిఐ దొర రాజు




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి తో పాటు, వెనుక కూర్చునే పిల్లియన్ రైడర్ సైతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించడం అనేది చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదు కానీ, ప్రాణాన్ని రక్షించే అత్యంత ముఖ్యమైన భద్రతా సాధనమని మండపేట రూరల్ సిఐ పి దొర రాజు పేర్కొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, మాచవరం సెంటర్లో రాయవరం ఎస్సై డి సురేష్ బాబు తో కలిసి సోమవారం సిఐ దొరరాజు రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం పై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించక పోవడం వలన ప్రమాద సమయంలో తలకు తీవ్రమైన గాయాలవ్వడం తో పాటు ప్రాణ నష్టం జరిగి, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాహనదారులకు వివరించారు. టూ వీలర్ నడిపే వ్యక్తితో పాటు, వాహనం వెనుక కూర్చునే పిల్లియన్ రైడర్ కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు కౌన్సెలింగ్ చేసి, జరిమానాలు విధించకుండా సుమారు 16 మంది తో అక్కడిక్కడే హెల్మెట్ విక్రేతను ఏర్పాటు చేసి, హెల్మెట్లు కొనుగోలు చేసి, వినియోగించే విధంగా ప్రోత్సహించారు. హెల్మెట్ ధరించడం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదనీ, ప్రాణాన్ని రక్షించే అత్యంత ముఖ్యమైన భద్రతా సాధనమని పేర్కొన్నారు. ప్రజలు ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని వివరిస్తూ, కుటుంబ సభ్యులను గుర్తుంచుకుని బాధ్యతగా ప్రవర్తించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఛలానాలు విధించబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎఎస్ఐ రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ వీర్రాజు, కానిస్టేబుల్స్ వీరేంద్ర కుమార్, గన్నిబాబు, సురేష్ తదితర పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# రాయవరంలో ఘనంగా సంకటహర చతుర్థి పూజలు

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలోని రాజరాజేశ్వర కాలనీలో గల వరసిద్ధి వినాయకుడి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలను ఆలయ అర్చకుడు కాలధరి త్రినాధ్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో తొలుత వినాయ కుడికి ఏకవార అభిషేకాలు, గరికపూజ అర్చనలను నిర్వహించారు. అనంతరం వివిధ రకాల నేవైద్యాలు సమర్పించి హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలదరి సీతారామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ వర్ధంతి పట్ల నిర్లక్ష్యం వహించిన

# అధికారులపై ఆర్డీవోకు ఫిర్యాదు

### సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వినతి



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలో భారతరత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరించిన అధికారుల తీరుపై ఆగ్రహించిన దళిత సంఘాల నాయకులు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం ఆర్.డి.వో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ద్వారా ఆర్డీవో డి.అఖిల కు పిర్యాదు చేసినట్లు రాయవరం మండల కోఆప్షన్ సభ్యులు పొలిమాటి సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విషయంలో జరిగిన అవమానం మరొక నాయకుని విషయంలో తలెత్తకుండా ఉండు నిమిత్తం సర్క్యులర్ పాస్ చేసి, అధికారులు నిర్లక్ష్యం వహించకుండా హెచ్చరించాలని కోరగా, ఆర్డివో సానుకూలంగా స్పందించి, సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామినిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు దండంగి పైసా దాసు,గొట్టి సూరిబాబు, గొల్లపల్లి అర్జున్ రావు, ఎల్లే శ్యాంసన్, గోసాల శేషుబాబు జై భీమ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పరిష్కారం కోరుతూ 'మీకోసం'కు మూడు అర్జీలు



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయములో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక, మీకోసం కార్యక్రమానికి మూడు అర్జీలు అందినట్లు రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల ప్రకటన ద్వారా తెలిపారు. కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో చెరువు ఆక్రమణ తొలగించుట గురించి, రామచంద్రపురం నందు మ్యుటేషన్ కొరకు, ద్రాక్షారామ గ్రామములో భూమి ఆక్రమణ తొలగించాలని కోరుతూ మూడు వినతులు అందినట్లు ఆర్డీవో డి.అఖిల తెలిపారు.

### గోదావరి పుష్కరాల నాటికి కోటసత్తెమ్మ తల్లి

# ఆలయ ఆధునికీకరణ పనులు పూర్తి

### నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా ఆశీర్వదించాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రార్థన

**నిడదవోలు, విశ్వంవాయిస్ న్యూస్ :** కోట సత్తెమ్మ ఆలయ ఆధునికీకరణ పనులు చేపట్టి గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం నిడదవోలు రూరల్ మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ తల్లి దేవాలయాన్ని తిరునాళ్ళ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. శంఖ చక్ర గద అభయ హస్త యజ్ఞోపవీతధారిణిగా ఏకశిలా స్వయంభూ విగ్రహంతో త్రిశక్తి స్వరూపిణిగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక



పూజలు నిర్వహించి సారె సమర్పించారు. భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల సౌకర్యం కోసం కోటసత్తెమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం నిడదవోలు పట్టణంలో వేంచేసి ఉన్న నంగాలమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పూలు, పళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య కోటసత్తెమ్మ ఆలయ అధికారులు, వేద పండితులు మంత్రి దుర్గేష్ కు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి దుర్గేష్ తో పాటు నిడదవోలు మున్సిపాలిటీ చైర్మన్ భూపతి ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా ఆశీర్వదించాలని స్థానికంగా కొలువైన శక్తి స్వరూపిణులు కోటసత్తెమ్మ తల్లి, నంగాలమ్మ తల్లిని మంత్రి దుర్గేష్ ప్రార్థించారు.

### కిమ్స్‌లో ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో

# మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ ప్రాంగణం లో 3వ ప్రపంచ తెలుగు మహా సభలు 28/02/2026 (శనివారం), 01/03/2026 (ఆదివారం) తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చైతన్య, కిమ్స్ విద్యా సంస్థల స్థాపకులు, చైర్మన్ కె.వి.వి సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కిమ్స్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రపంచ తెలుగు మహా సభలు మన తెలుగు ప్రజలందరి పండుగగా భావించి ప్రతి ఒక్కరు ఈ మహా సభలు ఘనంగా జరిపేందుకు తమ వంతు తోడ్పడాలని కోరారు. ఈ సభల గోడ పత్రికను నవంబరు 30 వ తేదీన అనేక మంది ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తెలుగు పండితులు, పాత్రికేయులు, తెలుగు భాషాభిమానుల సమక్షంలో ఆవిష్కరించామని తెలిపారు. గత రెండు ప్రపంచ తెలుగు మహా సభలను రాజమహేంద్రవరం లో ఘనంగా నిర్వహించామని, వాటికి తెలుగు ప్రజల నుండి వచ్చిన విశేష స్పందన, ఆదరణలతో చాలా సంతోషం కలిగిందని, ఈ 3 వ ప్రపంచ తెలుగు మహా సభలను కూడా మరింత ఘనంగా అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో నిర్వహిస్తామని శ్రీ చైతన్య రాజు తెలిపారు.అనేక మంది కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, రాజకీయ ప్రముఖులను ఈ కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నామని, విద్యా సాహితీ సమావేశాలు జరుగుతాయని, తెలుగు భాష వికాసానికి పాటుపడిన అనేక మంది ప్రముఖ పండితులను, కళాకారులను సన్మానించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రెండు రోజుల పాటు నాలుగు వేదికలపై జరిగే ఈ మహా!సభలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని,

### కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు



తెలుగు సాంప్రదాయ కళలు, సాంప్రదాయ పిండి వంటలు గురించి తెలిపే ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, సుమారు లక్ష మందికి పైగా ప్రతి రోజు ఈ కార్యక్రమాలలో పాల్గొంటారని అంచనా అని ఆయన తెలిపారు. పాత్రికేయులను కూడా ఈ మహా సభల నిర్వహణ విషయంలో సూచనలు సలహాలు అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ మహా సభలలో విద్యార్థులకు తెలుగు భాష ప్రావీణ్యం లో అనేక అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం ద్వారా చిన్నారులలో తెలుగు భాషాభిమానాన్ని పెంపొందించి భావితరాలకు తెలుగు భాష తియ్యదనాన్ని అందించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రపంచ తెలుగు మహా సభలు అత్యంత వైభవంగా, ఎప్పటికీ చరిత్రలో నిలిచి పోయేలా నిర్వహించాలని తమ ఆకాంక్ష అని, ఈ మహా యజ్ఞానికి తెలుగు వారందరు తెలుగు వారి పండుగగా భావించి, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కేరళ తరహా టూరిజంలా కోనసీమలో అభివృద్ధి

### నభూతో నభవిష్యతి అన్నట్లుగా సంక్రాంతి సంబరాలు

### సంక్రాంతికి జరగనున్న డ్రాగన్ పడవ పోటీల బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేరళ తరహాలో కోనసీమ కూడా టూరిజం పరంగా అభివృద్ధి చెందాలని, అందుకు కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద సోమవారం సంక్రాంతికి నిర్వహించనున్న కేరల తరహా డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలకు సంబంధించిన బ్రోచర్,పోస్టర్, లోగోల ఆవిష్కరణ కార్యక్రమంలో కొత్తపేట ఆర్డివో పి శ్రీకర్, కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్,వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు,ఆకుల రామకృష్ణ, కెవి సత్యనారాయణ రెడ్డి తదితరులతో కల్సి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లొల్ల లాకుల వద్ద ఆత్రేయపురం తాడిపూడి వంతెన వద్ద గత సంవత్సరం కంటే మిన్నగా డ్రాగన్ పడవల పోటీలు,ఈత పోటీలు, రంగవల్లుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహిస్తామన్నారు.ఈ డ్రాగన్ పడవల పోటీలు నభూతో న భవిష్యత్తు అన్నట్లుగా జరగనున్నాయని తెలిపారు. ఇందుకోసం కంపెనీని సైతం రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం జరిగిన డ్రాగన్ పడవల పోటీలు,ఈత పోటీలు అందరినీ ఆకర్షించాయని, పర్యాటకులను ఆకట్టుకున్నాయన్నారు. వాటిని మించేలా ఈ ఏడాది జాతీయస్థాయిలో డ్రాగన్ పడవల పోటీలు జరపాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా అన్న రీతిలో, ఈ ప్రాంతం అంతా టూరిజం పరంగా అభివృద్ధి చెందే విధంగా వాడపల్లి వెంకన్న కొలువుదీరిన ఈ ప్రాంతంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరిట పెద్ద ఎత్తున నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు అందించడానికి ఆలోచన చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ కూడా ప్రత్యేకంగా శ్రద్ధ పెడుతున్నారన్నారు. ప్రభుత్వం, స్పాన్సర్స్ సహకారంతో స్థానికంగా ప్రసిద్ధి పొందిన ఆత్రేయపురం పూతరేకులు, మామిడి తాండ్ర, బొబ్బట్లు కండ్రిగ కోవా, నార్కెడ్ మిల్లి పచ్చళ్ళు మొదలైన వాటితో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు జరుగుతుందన్నారు. వాటన్నిటికీ విస్తృతమైన మార్కెటింగ్ లభించడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ ప్రాంతం టూరిజం పరంగా కేరళ తరహాలో అభివృద్ధి చెందడానికి ఈ డ్రాగన్ పడవల పోటీలు దోహదం చేస్తాయని తెలియజేశారు. అనంతరం బ్రోచర్, లోగోలను ఆవిష్కరించి, పోస్టర్ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ & బి డి ఈ రాజేంద్రప్రసాద్,ఆర్టీసీ డిపో మేనేజర్ వై వి వి వి ఆన్ కుమార్,హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగుమళ్ళ శ్రీనివాస్, కెనాల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వెంకటేశ్వరరావు, సిఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎమ్మార్వో టీఆర్ రాజేశ్వరరావు, ఎస్సై రాము, ఎఫ్డిఓ దేవిద్రాజు,ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కుసంపూడి రామకృష్ణంరాజు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాంతి నుంచి అన్ని సేవలూ ఆన్‌లైన్ లోనే..

### ఆర్టీసీలో సేవలు మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోండి - డ్రోన్ సేవలు మరింత విస్తృతపరచాలి

### ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే సంక్రాంతి నుంచి రాష్ట్రంలో పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ దిశగా ఆయా శాఖలన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీజీఎస్ పై సీఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి నుంచి ప్రజలకు అన్ని సేవలు ఆన్ లైన్‌లోనే అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో సేవలు అందించడం ద్వారా ప్రజలకు సేవలు పారదర్శకంగా అందడంతో పాటు వారిలో ప్రభుత్వ పని తీరు పట్ల సంతృప్త స్థాయి పెరుగుతుందన్నారు. ఇప్పటికీ కొన్ని శాఖలు భౌతికంగానే సేవలందిస్తున్నాయని అలాంటి శాఖలు వెంటనే తమ పంథా మార్చుకుని ప్రజలకు ఆన్‌లైన్‌లో సేవలందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలన్నీ, ప్రభుత్వ కార్యాలయాలకు తిరగనవసరం లేకుండా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రిజిస్ట్రేషన్ల అనంతరం డాక్యుమెంట్లు కొరియర్ ద్వారా నేరుగా సంబంధిత వ్యక్తుల ఇళ్లకే పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ సేవలు మరింత మెరుగయ్యేలా చూడాలన్నారు. బస్టాండు ప్రాంగణం, పరిసరాలు, టాయ్‌లెట్ల వద్ద పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు ఉండాలని సీఎం అన్నారు. డ్రోన్ సేవలు మరింత విస్తృత పరిచాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో డ్రోన్ల ఉపయోగం గణనీయంగా పెరుగుతుందన్నారు. పురుగు మందుల వినియోగం తగ్గించేందుకు డ్రోన్లను ఎలా వాడుకోవచ్చోననే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ ద్వారా వ్యాధుల వ్యాప్తి లేకుండా చేయవచ్చని తెలిపారు. కొన్ని జిల్లాల్లో కొంతమంది అధికారులు మంచి కార్యక్రమాల్ని అమలు చేస్తున్నారని... అలాగే కొందరు అవలంభించే మంచి పద్ధతులను గుర్తించి మిగిలిన జిల్లాల్లో కూడా అమలయ్యేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అనాథాశ్రమ పిల్లలకు అమృత హెల్త్ స్కీమ్



**గుంటూరు, విశ్వం వాయిస్ ప్రతినిధి :** ప్రభుత్వ గుర్తింపు పొందిన అనాథాశ్రమాల్లో నివసిస్తున్న అనాథ పిల్లల సంక్షేమం దృష్ట్యా డా.ఎన్టీఆర్ వైద్యసేవ / అమృత హెల్త్ స్కీమ్ ను అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అమృత హెల్త్ కార్డులను చిన్నారులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 39 మంది లబ్ధిదారులకు ప్రత్యేక అమృత హెల్త్ కార్డులు ముద్రించి పంపిణీ చేయడం జరిగిందన్నారు. డా. ఎన్టీఆర్ వైద్యసేవ గుర్తింపు పొందిన నెట్వర్క్ ఆసుపత్రుల్లో పూర్తిగా నగదు రహిత (క్యాష్లెస్) వైద్యం అందుతుందని, మొత్తం 3257 శస్త్రచికిత్సలు / చికిత్సా విధానాలకు అర్హత ఉందన్నారు. సంబంధిత అనాథాశ్రమాల ద్వారా సరళమైన రిఫరెల్ విధానం ఉంటుందని చెప్పారు. లబ్దిదారులకు సమయానుకూలంగా, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనాథాశ్రమాల్లోని అనాథ పిల్లలకు ఉచితంగా అధునాతన వైద్యం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. వివరాలు, సహాయం కోసం గుంటూరు జిల్లా డా. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయాధికారిను సంప్రదించవచ్చని సూచించారు. అనాథ పిల్లల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి పథకాల్లో అమృత్ ఆరోగ్య పథకం ఒకటని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయ లక్ష్మి, డా. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయ అధికారి విజయ్ పాల్గొన్నారు.

# నరసరావుపేటలో డిస్ట్రిక్ట్ లెవల్ పారా ఒలింపిక్స్ క్రీడలు

### ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద

**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో శంకర భారతిపురం జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో డిస్ట్రిక్ట్ లెవల్ వన్‌డే స్పోర్ట్స్ పారా ఒలింపిక్స్ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు . నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, సమగ్ర శిక్ష వికలాంగుల పారా ఒలింపిక్స్ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి దాదాపు 300 మంది వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ సమాజంలో మానసిక వికలాంగులు ఎక్కువ శాతం ఉన్నారని అన్నారు. "వారి కన్నా శారీరక వికలాంగులు చాలా ఉన్నతులు" అని




ఆయన పేర్కొన్నారు. జిల్లాలో భవిత సెంటర్ల ప్రాధాన్యతను వివరిస్తూ ఇవి వికలాంగుల అభివృద్ధికి కీలకమని తెలిపారు. "భవిత సెంటర్ల ద్వారా వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఉమ్మడి కూటమి ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలు ఎంతో ముఖ్యమైనవి" అని ఆయన వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 6,000 మంది వికలాంగ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. 28 మండలాల్లో భవిత సెంటర్లు ఉన్నాయని, వీటి ద్వారా వికలాంగులకు అవసరమైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎస్ఎస్ఎన్ కళాశాల కమిటీ అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పారా ఒలింపిక్స్ క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే క్రీడా ప్రాంగణాన్ని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరుపుకునేందుకు అనుమతి ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

## ప్రజాదర్బార్లో ఇరువురికి ఆర్థిక సాయం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్ర పురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వితంతు పింఛన్ కోరుతూ షేక్ మల్లికా బేగం అనే మహిళ మంత్రి సుభాష్ కు అర్జీ సమర్పించారు. మంత్రి తక్షణం స్పందిస్తూ ఆమెకు రూ. 4 వేలు ఆర్థిక సహాయం అందించి, పింఛను మంజూరు అయ్యే వరకు తానే పింఛన్ ఇస్తానని భరోసా ఇచ్చారు. అలాగే కాజులూరు కు చెందిన కొప్పిరెడ్డి దుర్గాదేవి తన కుమారుడు కొప్పిరెడ్డి కుమార్ సూర్య గంగ ఆరోగ్య స్థితి బాలేదని అర్జీ ఇవ్వగా ఆ మహిళకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొసం ప్రతివారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలు ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు వంటి పలు అంశాలపై వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందని, ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగు తుందని, ప్రజా దర్బార్‌కు సంబంధించిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు అందజేయడం జరుగుతుందని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, రామచంద్రపురం రూరల్, కాజులూరు, కె.గంగవరం మండలాల టిడిపి అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, మేడిశెట్టి రవికుమార్, చవ్వాకుల నారాయణమూర్తి, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ళ...

## మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనంపై సీఎంకు ధన్యవాదాలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** అమరావతి సెక్రటరియేట్‌లో సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను సోమవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా గల తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసి మండపేట నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు.

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమన్వయ సమావేశంలో పాల్గొన్న

# ఎమ్మెల్సీ, రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స, జిల్లా అధ్యక్షులు చిర్ల



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం రావులపాలెం గ్రామంలో సిఆర్‌సి ఫంక్షన్ హాల్ వద్ద ఈరోజు నిర్వహించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న శాసనమండలి ప్రతిపక్ష నేత, ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి రివ్యూ మీటింగ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నేతలు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శత శాతం అర్జీదారునికి పరిష్కారం చూపాలి : కలెక్టర్ మహేష్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి అర్జీదారులకు శత శాతం పరి ష్కార మార్గాలు సంతృప్తికర స్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మాన్ని జిల్లా స్థాయిలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చేరువగా సుపరి పాలన లక్ష్యంగా మండల డివిజన్ జిల్లా స్థాయిలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు అధికారులతో కలసి నిర్వహించి కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 265 అర్జీలు వచ్చాయి. వీటిని నిర్దేశ గడుపులోగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో వివిధ స్థాయిలలో పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నామని చెప్పారు. అత్యంత పారదర్శకంగా, జవాబు దారీతనంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అర్జీలు సమర్పించిన వారికి సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎ స్)కు హాజరైన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం లభించేలా కృషి చేయా పీజీఆర్ఎస్ అర్జీదారులతో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడాలని చెప్పారు. సరైన విధంగా ఎండార్స్మెంట్లు ఇవ్వాలని, అర్జీదారులతో అధికారుల ప్రవర్తన విషయంలో మంచి ఫీడ్బ్యాక్ వచ్చేలా చిత్తశుద్ధి, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు అర్జీదారుల పట్ల సంయమనం ఓర్పుతో వ్యవహరించి సావధానంగా సమస్యలను వినాలన్నారు ఫిర్యాదుల ఆడిటింగ్ సక్రమంగా పూర్తి చేయా లని, సమస్య పరిష్కార అధికారి (గ్రీవెన్స్ రెడ్రెస్సల్ అథారిటీ) స్వయంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని చెప్పారు. అర్జీదారులనుంచి వచ్చిన ప్రతి ఫీడ్ బ్యాక్ ను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారికి సూచనలు ఇవ్వాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి ప్రసంగిస్తూ అర్జీదారులతో సంబంధిత అధికారి మర్యాదగా ప్రవర్తించాలని, ఎండార్స్మెంట్ తప్పకుండా ఇవ్వాలని చెప్పారు. వ్యవహారశైలి, పరిష్కార విధానం సరిగ్గా లేవన్న అభిప్రాయం అర్జీదారుల నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ రాకూడదని స్పష్టం చేశారు. రీఓపెన్ చేసిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టిసారించి, త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. వివిధ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సంతృప్త స్థాయిని పెంచాలన్నారు. విజన్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్ క్రియాశీలతకు సమిష్టిగా కృషిచేయాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్‌తో పాటు కీలక ప్రగతి సూచికలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. అర్జీలన్నింటిని క్షుణంగా పరిశీలించి గడువులోగా పరి ష్కరించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మాధవి, డ్వామా పిడి ఎస్ మధుసూదన్, సమగ్ర శిక్ష ఏపిసి జి.మమ్మీ, డిఎల్‌డివో రాజేశ్వరరావు, జిల్లా అధికారులు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### కరాటే పోటీల్లో

# ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం అనపర్తి టిటిడి కళ్యాణ మండపంలో జపాన్ షోటోకన్ ఆర్గనైజేషన్ కరాటే అకాడమీ వారు నిర్వహించిన అటల్ జి ఎపి స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు కోచ్ పడాల అంజి తెలిపారు. ఈ పోటీలలో కటాస్ విభాగంలో కొత్తూరి చిన్మయ సాయి శార్వాణి, నందుల షణ్ముఖ,గుంటూరీ యువన్ కార్తీక్, అల్లూరి కుశల్ వర్మ , వెలిది కార్తికేయ ఆర్యన్ భరద్వాజ్, బసవ సాయి నందన్ బంగారు పతకాలు సాధించారు వీరిని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ నంద్యాల మనో విహార్ అభినందించారు.

### బాధితుల సమస్యలకు

# సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

### జిల్లా ఎస్పి రాహుల్ మీనా



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** బాధితుల సమస్యలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం: జిల్లా ఎస్.పి రాహుల్ మీనా. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా, సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డిపిఓ) నందు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిగజి ఆర్ ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి రాహుల్ మీనా, ఐ.పి.ఎస్ , జిల్లా అడిషనల్ ఎస్.పి ఏ.వి.ఆర్.పి.బి ప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు.

**అర్జీల స్వీకరణ:** జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్.పి దృష్టికి తీసుకువచ్చారు. ఎస్.పి రాహుల్ మీనా ప్రతి అర్జీదారునితో ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను సానుకూలంగా, క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.

**ప్రధాన సమస్యలు:** ఈ కార్యక్రమంలో 36 ఫిర్యాదులు వచ్చాయి.ప్రధానంగా భూ తగాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, సివిల్ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి.

**అధికారులకు ఆదేశాలు:** స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు సిఫార్సు చేశారు. బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.

**భరోసా:** ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించేలా, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిష్కరిస్తామని ఎస్.పి బాధితులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి రాహుల్ మీనా ఐపిఎస్, అడిషనల్ ఎస్.పి ఏవిఆర్‌పిబి ప్రసాద్‌తో పాటు పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సూక్తులు, సూచనలు అనుసరణీయం : డాక్టర్ నరసింహామూర్తి





**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలో అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కాట్రూ శాంతి కిరణ్ అధ్యక్షతన డాక్టర్ పరమట నరసింహామూర్తి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వ్రాసిన మరియూ అనేక సందర్భాల్లో బహిరంగ వేదికల పై అయన చెప్పిన నినాదం "పే బ్యాక్ టు ద సొసైటీ" నువ్వు ఉన్నత పదవులు, ఉద్యోగాలు చేస్తున్నప్పటికి నువ్వు పుట్టిన ఊరికి ఎంతో కొంత తిరిగి చెల్లించాలని చెప్పిన ఆ సూత్రానికి నిజం చేసి చూపాలని ఆలోచన తో మా గ్రామంలో పుట్టి పెరిగి ఉన్నత వైద్య విద్యను అభ్యశించి అనేక మంది పేద ప్రజలకు ప్రాణాలు కాపాడగలిగాను, ఉద్యోగ బాధ్యతలతో పాటు పేదలకు ఉచిత వైద్యాన్ని సైతం అందించాను. మహనీయుడుఅంబేద్కర్ ఇచ్చిన స్ఫూర్తితో గత 25 సంవత్సరాలుగా అంబేద్కర్ జయంతిని మరియు వర్ధంతిని పురస్కరించుకొని గ్రామానికి, గ్రామ ప్రజలకు సౌకర్యార్థం, స్వియా ప్రయోజనార్ధం కొన్ని లక్షలు వెచ్చించి కార్యక్రమాలు చేస్తున్నాను అని తెలిపారు. గతంలో గ్రామానికి ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహం ముందు సుమారు 25 సంవత్సరాల క్రితం మా తల్లీదండ్రుల పేరిట 3.5 లక్షలు వెచ్చించి బస్ షెల్టర్ నిర్మించాను, అలాగే గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం వెల్ నెస్ సెంటర్ మంజూరు చేసిన నిర్మాణానికి అనువైన స్థలం దొరకక ఇబ్బంది పడుతున్న సమయాన నా సొంత స్థలం మరియు వారి సొంత అన్నదమ్ముల స్థలం కొని సుమారు 264 గజాల స్థలం గ్రామ పంచాయితీకి దానంగా వ్రాసి ఇచ్చాను అని అన్నారు. మొన్న జరిగిన అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం గ్రామంలో సుమారు 150 మంది పేద, వృద్ధులకు మరియూ వికలాంగులకు దుప్పట్లు (రగ్గులు) పంపిణీ చేపట్టాము అని తెలిపారు. ఈ కార్యక్రమం లో నాతో పాటు నా కుమారులు సారధి, కృష్ణమోహన్ లు భాగస్వామ్యం కావటం నాకు చాలా ఆనందదాయకం అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్య విషయం ఏమనగా నా ఇద్దరు కుమారులు మొదటి కుమారుడు పరమట సారధి గారు (ఆంధ్రా కిచెన్ రిస్టోరెంట్స్-జపాన్లో నాలుగు బ్రాంచిలు) అయన రెండో కుమారుడు కృష్ణమోహన్ (సివిల్ ఇంజనీర్) విరిరువురు తండ్రిగా నా సేవా భావాన్ని అందిపుచ్చుకుని వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారు. భవిష్యత్‌లో ఈ కార్యక్రమాలు కొనసాగించేందుకు వారిరువురు నా పేరిట డాక్టర్ పిఎన్ఎమ్ చారిటబుల్ పేరిట ట్రస్ట్ (డాక్టర్. పరమట నరసింహామూర్తి చారిటబుల్ ట్రస్టు) కూడా త్వరలోనే ప్రారంభిస్తున్నారని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను అన్నారు. ఈ ట్రస్టు ముఖ్య ఉద్దేశం విద్యలో అధ్యధిక మెరిట్ సాధించిన దళిత పేద విద్యార్థులకు స్కాలర్షిప్ ఏర్పాటు చేయటం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వడ్డీ సుభాషిని ఎలీషా రాజు, ఎంపీటిసి రాజేశ్వరి ప్రమోద్, విశ్రాంత ఉపాధ్యాయులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సుమారు కార్యక్రమం లో పాల్గొన్న గ్రామస్థులందరికి భోజనాలు ఏర్పాటు చేసి ఘనమైన నివాళులు అర్పించారు.

# మాదిగల ఆత్మీయ కలయిక కార్యక్రమం విజయవతం చేయండి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 11వ తేది అమలాపురం కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో జరగబోవు "మాదిగల ఆత్మీయ కలయిక" కార్యక్రమం విజయవంతం చేయుట కొరకు అమలాపురం పట్టణంలోని ప్రీతి లాడ్జిలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ మాదిగ సోదరులు సోదరీమణులు అక్క చెల్లెలు ఆడపడుచులు అందరూ డిసెంబర్ 11వ తేదీ ఉదయం 10 గంటలకు అమలాపురం కొంకాపల్లి శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే "మాదిగల ఆత్మీయ కలయిక"కు పార్టీలకు అతీతంగా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి మాదిగ సోదరులు భారీ ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసి మాదిగల ఐక్యతను నిరూపించుకొని తద్వారా రాజకీయంగా,సామాజికంగా ఎదుగుదలకు అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రవీందర్, మడికి శ్రీరాములు, బడుగు శ్రీను, పలివెల మోహన్ రావు, పలివెల నాగేంద్రప్రసాద్, ఆకుమర్తి దుర్గారావు, ఆనంద్ శేఖర్, మల్లవరపు శ్రీను, ఉందుర్తి ప్రసాద్, ఆకుమర్తి సత్యనారాయణ, రాయి ధనరాజు, ఉంద్రాజవరపు చిన్న,ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ దంసూరి, ఐఎంఆర్పిఎస్ ప్రెసిడెంట్ సవరపు భైరవమూర్తి, ఎంఎస్పి డిస్టిక్ రిప్రజెంటేటివ్ ఎన్. సత్యనారాయణ,ఎం పి ఎస్ డిస్ట్రిక్ట్ రిప్రజెంటేటివ్ ఆకుమర్తి మోహన్, మంద రామకృష్ణ,ఉండవల్లి ఎలియా, గంపల ప్రసాద్, చుట్టుగుల్ల కిషోర్, పెదపూడి శ్రీను, నేదునూరి నేతనీల్, ముసూడి నరసింహమూర్తి, సిహెచ్ రాధాకృష్ణ, ముసూడి బాలాజీ, ప్రేమ్ కుమార్, ఎల్ ప్రసాద్,సిహెచ్ సురేష్, కె రాఘవులు, కె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభువు విశ్వాస పాత్రులందరూ జరుపుకునే పండుగ క్రిస్మస్ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం సీడబ్ల్యూఏ గ్రౌండ్ లో జరిగిన కొత్తపేట మండల పాస్టర్స్ ఐక్య గ్లోరియస్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పేదప్రజల కోసం కష్టపడుతున్న ప్రతీ ఒక్కరికీ ప్రభువు ఆశీస్సులు ఉంటాయన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి తప్పక కృషి చేస్తానని తెలిపారు. ఆలమూరులో సైతం పాస్టర్స్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి ఈ మధ్యే శంకుస్థాపన చెయ్యడం జరిగిందన్నారు.

# రావులపాలెం అరటి మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి...

### రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, వే బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తాం : కొత్తపేట ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం అరటి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మార్కెట్ యార్డును పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డుకు ఉత్తరం వైపున ఏఎంసి ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. మార్కెట్ యార్డ్ బయట రావులపాలెం వెదిరేశ్వరం కాలువవైపు డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు,నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామన్నారు. వే బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతామని తెలిపారు. ఆయా పనులకు సంబంధించి త్వరలోనే ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు. ఎమ్మెల్యే బండారుకు రైతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ జిల్లా ఎడిషన్
మంగళవారం, 09 డిసెంబర్ 2025
www.viswamvoice.com


అర్హులైన లబ్ధిదారులకు

# ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ

కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు అన్ని విధాలా మేలు : రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గం గుడారిగుంట గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ క్యాంపు కార్యాలయం వద్ద సివిల్ సప్లై విభాగం వారు ఏర్పాటు చేసిన ఉజ్వల 3.0 పథకం ద్వారా అర్హులైన 763 మంది మహిళా లబ్ధిదారులకు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేతులమీదుగా ఉచిత గ్యాస్ సిలిండర్,స్టవ్,రెగ్యులేటర్ తో కూడిన గ్యాస్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారి ఆశయాల మేరకు ప్రతి ఒక్క మహిళకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలనే లక్ష్యంగా ఉజ్వల 3.0 ద్వారా ఉచితంగా కనెక్షన్ మంజూరు చేసి అందజేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించిఅందజేస్తున్నామని అదేవిధంగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు ముందుకు తీసుకెళుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్ర రావు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావు, మాజీ జడ్పీటీసీ నూరుకుర్తి వెంకటేశ్వర రావు, బీజేపీ నాయకులు రంభాల వెంకటేశ్వర రావు, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, రూరల్ మండల అధ్యక్షులు కరెడ్ల గోవింద్, కరప మండల అధ్యక్షులు బండారు మురళి, మాదారపు తాతాజీ, పితాని లీల, బందిలి వీరీష, జనసేన సీనియర్ నాయకులు బోగిరెడ్డి కొండబాబు, కరప వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ముద్రగడ రమేష్, జనసేన కరప మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మెండు గోవింద్, బోళ్ల కృష్ణ మోహన్, పోసిన రాము, శ్రీరాములు, ఫణి, యాళ్ల సత్యనారాయణ (పండు),సోదే ముసలయ్య, కృష్ణ, బత్తుల సతీష్, ముత్యాలరావు, డి.ఎస్. ఓ సత్యనారాయణ రాజు, ఎం.ఎస్.ఓ వీరస్వామి, రూరల్ ఎమ్ఆర్ఓ కుమారి, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసు క్రీస్తు జన్మదినం ఓ శుభ సందేశం...!

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**రౌతులపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రీస్తు జన్మదినం అనేది ఒక పండుగ సందర్భం మాత్రమే కాదు. మానవాళికి క్రీస్తు అందించిన శాంతి సందేశాన్ని పంచుకునే శుభదినమని ఎమ్మెల్యే వరుపులు సత్యప్రభ పేర్కొన్నారు. ప్రపంచానికి క్రీస్తు బోధనలు శాంతి, సేవ, ప్రేమకు ఆదర్శం" అని పేర్కొన్నారు. మతంతో, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రపంచం అంతటా మానవాళి నిర్వహించుకునే వేడుకే ఈ క్రిస్మస్. విశ్వ శాంతి దూత ఏసుక్రీస్తు జన్మదినం ఓ శాంతి సందేశమని ఆమె వివరించారు. దైవ జనులు, క్రైస్తవులు అందరికీ ఏసుక్రీస్తు జన్మదినం శుభ సందర్భంగా శుభాకాంక్షలు అంటూ ఆమె తన సందేశాన్ని అందించారు. పరిశుద్ధ గ్రంథంలో దేవుడు బోధించిన దయా, జాలి, క్షమాగుణం, ఐకమత్యం వంటి సుగుణాలను ప్రతీ ఒక్కరూ కలిగి ఉండాలనేది ప్రపంచ మానవాళికి ఇచ్చిన గొప్ప శుభ సందేశమని ఎమ్మెల్యే వివరించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం రౌతులపూడిలో యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పాస్టర్స్ ఫ్యామిలీస్ మెగా క్రిస్మస్ వేడుకల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. పరిశుద్ధ గ్రంథంలోని మంచి విషయాలను సంఘానికి సంఘ కాపరులు బోధించాక వాటిని పాటిస్తున్నారా లేదా అనేది ముఖ్యం. మనం ఎవరికైనా సలహా ఇచ్చినపుడు దానిని మనం పాటిస్తూ ఉన్నామా లేదా అన్నది గుర్తించు కోవాలి. ఇక్కడ ఉన్న దైవజనులు అందరూ బైబిల్లోని విషయాలను సులభ తరమైన విధానంలో సంఘాలకు చెబుతున్నప్పుడు దానిని మనం ఆలోచిస్తున్నారా లేదా అన్నది మనం గుర్తించు కోవాలి. బైబిలు సందేశాలను మనందరి హృదయాల్లో నింపుకొని ముందుకు సాగాలని సూచించారు. మీ అందరి బిడ్డ స్వర్గీయ వరుపుల రాజా ఏ బాధ్యతనైతే తన మీద ఉంచి మనల్ని విడిచి వెళ్ళారో ఆ బాధ్యతను నేను నెరవేర్చడంలో మీరు అందరూ సహకరించారు. అందుకు ధన్యవాదములు. మీరు అందరూ నాపై ఏ నమ్మకం అయితే నా వెంట ఉన్నారో ఆ నమ్మకాన్ని వమ్ము కానివ్వనని మీకు మాట ఇస్తున్నాను. క్రీస్తు జన్మదినాన్ని ఇంతటి గొప్పగా నిర్వహించిన మీరు అందరూ రాబోయే కాలంలో కూడా ఇలాగే ఐకమత్యంగా ఉండి ఈ వేడుకలను నిర్వహించాలని కోరుతున్నాను. మీ అందరికి మరోమారు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్నాను అన్నారు. అనంతరం ఫెలోషిప్ సభ్యులకు ప్రత్యేక బహుమతులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమం ప్రారంభంలో క్రీస్తు జన్మదిన వేడుకలకు సూచికగా కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కొందరు పెద్దలకు తినిపించారు. ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలో పాస్టర్స్ కుటుంబాలు, ఫెలోషిప్ ప్రతినిధులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సత్యప్రభను కలిసిన

# ప్రత్తిపాడు సిహెచ్‌సి నూతన సూపరింటెండెంట్ సౌమ్య



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ ఎ.సౌమ్య ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి టిడిపి కార్యాలయంలో వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నానితో కలిసి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసారు.ఎమ్మెల్యే సత్యప్రభ రాజా మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్తిపాడు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు సమిష్టిగా పని చేయాలని సూచించారు.ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యంగా తీసుకుని సేవలందించాలని సూచించారు.ఆసుపత్రి అభివృద్ధి కమిటీతో సమన్వయం చేసికుంటూ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తానని,ప్రజల ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి చేస్తామని డాక్టర్ సౌమ్య అన్నారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ వర్షిత వారి వెంట ఉన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులను

# సకాలంలో పరిష్కరించాలి : జేసీ భరత్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాల అందించాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో నూతన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎన్.శ్రీధర్, కేఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి, సీపీవో పీ.త్రినాథ్ తదితర అధికారుల కాకినాడ జిల్లా చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను, వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని జేసీ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, అన్నదాత సుఖీభవ పథకం వంటి అంశాలపై మొత్తం 482 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల స్థితిని తెలుసుకోవడానికి 1100 నెంబరుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి హాజరు కాలేని అర్జిదారులు, తమ యొక్క అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని జేసీ అపూర్వ భరత్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పిజిఆర్ఎస్‌కు 39 ఫిర్యాదులు

సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాలు



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (పీజీఆర్ ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, మొత్తం 39 ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన వాటిలో భూ తగాదాలు 11, కుటుంబ కలహాలు 11, ఇతర విభాగాలకు చెందినవి 17గా గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.బిందు మాధవ్ సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదులను 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలని చేపట్టిన చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎస్పీ"ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యం అని. ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి కట్టుబాటుతో పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత శాఖ అధికారులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాయస్థానంపై నమ్మకం - పాతదారుడికి విజయం

మెయిన్ రోడ్ లో రామా ఆప్టికల్స్ సీజ్ - కోర్టు ఉత్తర్వులతో సీళ్ళు తొలగింపు




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక మెయిన్‌రోడ్డులో దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న విడోస్ హోమ్ భవనంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో 4 షాపులను అద్దెకు తీసుకుని వ్యాపారం చేస్తున్న పాతదారుడు అద్దె బకాయిలు పెరగడంతో అనేకసార్లు నోటీసులు పంపించినా స్పందించకపోవడంతో ఇటీవల దేవాదాయ శాఖ అధికారులు షాపులను సీజ్ చేశారు. ఈ మేరకు చర్యలు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలపై చేపట్టినట్లు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఫణీంద్ర కుమార్ తెలిపారు. నోటీసులు అందజేసిన తర్వాత కూడా బకాయి చెల్లింపులపై స్పష్టత రాకపోవడంతో చట్టపరమైన విధానంలో సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, పాతదారుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కోర్టు మొత్తం వివరాలను పరిశీలించి విడుదల ఆర్డర్ జారీ చేసింది. న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు సోమవారం వారం పంచానామా పూర్తి చేసి, అధికారుల సమక్షంలో షాపుల సీళ్ళను తొలగించి తిరిగి పాతదారుడికి అప్పగించారు. దీనితో పాతదారుడికి ఊరట లభించడమే కాక, న్యాయం పట్ల నమ్మకం మరోసారి నిలదొక్కుకున్న ఉదాహరణగా ఈ ఘటన నిలిచింది. పరస్పర వివాదాలు ఉన్నప్పటికీ చట్టం ముందు అందరూ సమానమని, న్యాయం ఎప్పుడూ నిరూపితమైన వాస్తవాల ఆధారంగానే పని చేస్తుందని ఇది స్పష్టం చేస్తోంది. దేవాదాయ శాఖ చేపట్టిన చట్టపరమైన చర్యలు పాతదారుడు కోర్టు మార్గంలో సాధించిన న్యాయం రెండూ కలిసి వ్యవస్థ పారదర్శకతను సూచిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.క

# గుట్కా ప్రపంచంగా మారిన కాకినాడ జిల్లా

పట్టణాలు నుండి పల్లె వరకు ప్రతి షాపులోనూ దర్శనమిస్తున్న గుట్కా

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న దళారులు - చూచి చూడనట్టు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు




**ప్రతిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో ఎక్కడ చూసినా కల్తీ ప్రపంచం బడా బాబుల కనుసన్నల్లో జరుగుతుంది. తినేది త్రాగేది వేసుకునేది రాసుకునేది మొహానికి పూసుకునేది తయారు చేయడంలో చైనా ను మించి పోయినవారుగా ఉన్నారు. ఇప్పటికే దేశ జనాభాలో సగానికి పైగా పొగాకు భారిన పడి ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది మద్యానికి బానిసలై కుటుంబాలలో సంతోషం అనేది లేకుండా గడుపుతున్నారు. ఒరిస్సా బెంగాల్ వంటి రాష్ట్రాలలో పరిమితులు లేకుండా వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు వారి జీవనశైలిలో గుట్కాను వాడటం అనేది జరుగుతుంది. వారి అలవాట్లను ప్రతి రాష్ట్రంలోని ప్రజలు అలవర్చుకునేలా గుట్కాను తయారుచేసే కంపెనీలు పెద్ద పెద్ద సినీ సెలబ్రిటీలకు కోట్ల రూపాయలు వెచ్చించి దేశానికి మేలు చేసే కార్యక్రమం లా టెలివిజన్ల ద్వారా వీక్షకులకు కనిపింపుగా చూపించి చాప కింద నీరులా ప్రతి ఒక్కరు గుట్కా బారిన పడేలా చేస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి చూస్తే దేశంలో పొగాకు మద్యం వీటిని దాటి గుట్కా ముందు వరుసలో ఉంది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పట్టణాలు పల్లెటూర్లు అనేది లేకుండా ప్రతి చిన్న దుకాణంలో కూడా విచ్చలవిడిగా గుట్కా అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రతి ఒక్క వ్యాపారిపై కఠినమైన చర్యలు తీసుకుని నియోజకవర్గం లోని గుట్కా నిర్మూలన చేయాలని దానికి సంబంధించిన అధికారులు గుట్కాపై దృష్టి సారించాలని రిటైర్డ్ ఉద్యోగస్తులు సీనియర్ సిటిజన్స్ వారి ఆలోచనలను పత్రిక ముఖంగా తెలియజేశారు.

# హెల్మెట్‌లను విధిగా ధరించండి : ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ఎస్.పి రాహుల్ మీనా ఆదేశాల మేరకు అమలాపురం రూరల్ సి.ఐ,ప్రశాంత్ కుమార్, ఉప్పలగుప్తం ఎస్.ఐ రాజేష్ వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహన చోదకులు హెల్మెట్ లను విధిగా ధరించాలని అమలాపురం రూరల్ సి.ఐ,డి.ప్రశాంత్ కుమార్ సూచించారు. సిరిపల్లి-మునిప ల్లి ప్రధాన ఆర్ అండ్ బి రహదారిలో సోమవారం సన్నవిల్లి సెంటర్ వద్ద ద్విచక్ర వాహన చోదకులను ఆపి వారికి హెల్మెట్ వినియోగం ప్రయోజనాలపై అవగాహన కల్పించి వారిచే హెల్మెట్ లను కొనిపించారు.తప్పనిసరిగా హెల్మెట్ లను ధరించాలని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్ లు మాట్లాడవద్దని వాహన రికార్డులు సక్రమంగా ఉండాలని అలాగే మితిమీరిన వేగంతో వాహనాల నడిపి ప్రమాదాలు కోరి తెచ్చుకోవద్దని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రయాణించి క్షేమంగా గమ్యం చేరుకోవాలని నిబంధనలు పాటించని వాహన చోదకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ ప్రశాంత్ కుమార్ హెచ్చరించారు. దీనిలో ఉప్పలగుప్తం ఎస్.ఐ సి.హెచ్.రాజేష్, ఉప్పలగుప్తం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఈశ్వరీయ సేవలో 37 ఏళ్ళు..!

అమలాపురం ఓంశాంతి కేంద్రంలో 37వ వార్షికోత్సవ వేడుకలు

ధ్యాన మార్గంలో 20 ఏళ్ళు పూర్తి చేసుకున్న సుమారు 82 మందికి ఘన సన్మానం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వావిద్యాలయం అమలాపురం ఓం శాంతి కేంద్రం ఏర్పాటు అయి 37 ఏళ్ళు పూర్తి చేసుకుంది. ఈనేపథ్యంలో 37వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అమలాపురం రవణం వీధిలోని ఓంశాంతి హార్మోని హౌస్ లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలు గా సికింద్రాబాద్ నుండి బి.కె.సరోజదీదీ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్రహ్మకుమారీస్ ఇంచార్జి బి.కె. రజని విచ్చేయగా.. కోనసీమ బ్రహ్మ కుమారీస్ ఇంచార్జి బి. కె. శ్రీదేవి నేత్రుత్వ%శీ%లో ఇప్పటి దాకా ఈశ్వరీయ సేవలో 20 ఏళ్ళు పూర్తిచేసుకుని ఆధ్యాత్మిక జీవనం సాగిస్తూ.. రాజయోగ ధ్యాన మార్గంలో అనేక మందికి ప్రేరణ కలిగిస్తున్న సుమారు 82 మంది బ్రహ్మకుమారీలను దుస్సాలువాలు తో, మెమెంటో, ఈశ్వరీయ కానుకలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి.కె. మీరా, బి. కె. లక్ష్మి, బి.కె. స్వరూప, బి. కె. చంద్రకళ, బి. కె. భవానిలతో పాటు వేలాది గా బ్రహ్మకుమారీస్, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



### వెంకయ్యకు మధురపూడిలో

# ఎన్డీఏ నాయకులు ఘన స్వాగతం



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : దేశ మాజీ ఉప రాష్ట్రపతి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ముప్పవరపు వెంకయ్య నాయుడుకు పలువురు ఎన్డిఏ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం వెంకయ్య నాయుడు రాజమహేంద్రవరం నన్నయ్య యూనివర్సిటీలో "భారతీయ భాషలలో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం" కార్యాలయాన్ని ప్రారంభించడానికి ఆయన మధురపూడి విమానాశ్రయానికి విచ్చేశారు. ఆయనకు రాజానగరరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బిజెపి నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, హారిక తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాలలు వేసి సాలువాతో ఘనంగా సత్కరించారు.

### కరాటే పోటీలలో సత్తా చాటిన

# సరస్వతి విద్యార్థి వానపల్లి



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన కరాటే పోటీ లలో కోరుకొండ సరస్వతి విద్యానికేతన్‌కు చెందిన వాన పల్లి నితీష్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు కరస్పాం డెంట్ పెనకటి గంగాధర్ తెలిపారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈనెల ఏడో తేదీ ఆదివారం అనపర్తిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఐదవ తరగతికి చెందిన వానపల్లి నితీష్ సత్తా చాటి, ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. నితీష్ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని కొనియాడారు. ఈ సందర్భంగా కరాటే కోచ్ సుంకర వీరబాబును అభినందించారు. ఈ సందర్భంగా విజేత నితీష్, కోచ్ వీరబాబు కు కరస్పాండెంట్ గంగాధర్, ప్రిన్సిపాల్ హనుమ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

### రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విజేతలుగా

# షీలాది గ్లోబుల్ స్కూల్ విద్యార్థులు



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కోరుకొండ షీలాది గ్లోబుల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పథకాలను సాధించినట్లు కరస్పాండెంట్ గరగ లక్ష్మి పద్మావతి చంటి ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలు జి రిత్విక్ (ఆరవ తరగతి) బంగారు పథకాన్ని సాధించాడన్నారు. అదేవిధంగా విక్టోరియా( ఐదవ తరగతి) వెండి పథకాన్ని, జి వెంకటప్రదీప్ ( మూడవ తరగతి) వెండి పథకాన్ని సాధించి, పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి గుర్తింపును తీసుకొచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గరగ పద్మావతి చంటి ఆధ్వర్యంలో విజేతలను, కరాటే మాస్టర్ వీరబాబుకు అభినందనలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గరగ లక్ష్మీపద్మావతి చంటి, వైస్ ప్రిన్సిపల్ వై.సత్యలక్ష్మి, అకడమిక్ ఇంచార్జి పద్మ, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

### పదోన్నతిపై వెళుతున్న రమేష్ బాబుకు

# పలువురు ఘన సత్కారం

## కోరుకొండతో అనుబంధం వీడలేనిది



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : కోరుకొండ మేజర్ పంచాయతీలో మూడేళ్ల పాటు ప్రజలకు విశేష సేవలు అందించి పదోన్నతిపై వెళుతున్న రమేష్ బాబును మండలంలోని వివిధశాఖల అధికారులు ఘనంగా సత్కరించారు. సోమవారం కోరుకొండ సచివాలయంలో పదోన్నతిపై వెళుతున్న రమేష్ బాబును మండల అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్, సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ గణేష్ ఆధ్వర్యంలో పంచాయతీ, ఐసిడిఎస్, ఎన్ఆర్ఈజీఎస్ కు చెందిన వివిధ శాఖల అధికారులు ఆయన సేవలను కొనియాడుతూ, పూలమాలలు వేసి సాల్వతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ మూడేళ్ల పాటు గ్రామాభివృద్ధికి బాసటగా నిలిచిన కర్రి దంపతులకు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులకు, పంచాయతీ పాలకవర్గానికి, ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. పదోన్నతి పై ఆత్రేయపురం డిప్యూటీ ఎంపీడీవోగా వెళుతున్న, కోరుకొండ గ్రామ ప్రజలు, అధికారుల ఆప్యాయతలు ఎన్నటికీ మరువలేని భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయకండి

## వైసీపీ యువజన విభాగం రాజమండ్రి సిటీ అధ్యక్షుడు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో ఆందోళన
## రాజమండ్రి మెడికల్ కళాశాల వద్ద జగన్, భరత్ చిత్రపటాలకు పాలాభిషేకం

రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలకు నిరసనగా వైసీపీ యువజన విభాగం రాజమండ్రి సిటీ అధ్యక్షుడు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలోసోమవారం రాజమండ్రి మెడికల్ కాలేజీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ, ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం బిల్డర్ చిన్న, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి రొక్కం త్రినాథ్ మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చారని అందులో రాజమండ్రి మెడికల్ కళాశాల ఒకటని,అది త్వరగా పూర్తయ్యేలా నాటి ఎంపీ మార్గాని భరత్ ఎంతో కృషి చేశారని



ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.పేద,బడుగు బలహీన వర్గాల వారి పిల్లలకు వైద్య విద్య అందాలన్న జగనన్న ఆశయానికి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు.తమ ఆందోళనలో పాల్గొనేందుకు అనేకమంది ఆటో డ్రైవర్లు ఆటోలతోవచ్చారని, వారిపిల్లలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని అందరిలోను ఆందోళన వ్యక్తమవుతోందని బిల్డర్ చిన్న,రొక్కం త్రినాథ్ పేర్కొన్నారు. అయ్యా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దయచేసి మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయకుండా మీ నాయకుడికి చెప్పి ఆపించండి అని బిల్డర్ చిన్న విజ్ఞప్తి చేశారు.రాజమండ్రిలో ఎంతోమంది పేద విద్యార్థులు వైద్య విద్య చదవాలని ఆశతో ఎదురు చూస్తున్నారని వారి ఆశలపై నీళ్ళు చల్లవద్దని కోరారు.అలాగే నగరంలో రోడ్లు ఎక్కడికక్కడ గోతులుపడి ఉన్నాయని వాటిని తక్షణం పూడ్చాలని బిల్డర్ చిన్న, రొక్కం త్రినాథ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సప్పా ఆదినారాయణ, మునేశ్వరరావు, కటకం చిన్న,గుడివాడ అప్పారావు, ముప్పన శ్రీనివాస్, ఎస్సీ సెల్ దుర్గారావు, బూరకనక లింగేశ్వరరావు, కొమ్ముల దుర్గారావు, కందిరాఘవ, దూర్వాసుల సత్యనారాయణ, దువ్వాడ గౌరీ శంకర్, అజ్జరపు రామారావు, ఖాన్, కంది మురళి, విజయ్, శివ, శంఖం సత్తిరాజు, వంగల మహాలక్ష్మి, ధన, చంటి, సూర్యప్రకాష్, రొక్కం వంశీ, కట్టవెంకటేష్, ఎ.అరుణ, మరియు ఆటో యూనియన్ నాయకులు, 100 ఆటోలతో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా

# రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా కాలెపు సత్య సాయిరామ్



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా తూర్పుగోదావరి జిల్లా నుండి కాలెపు సత్య సాయిరామ్ రాష్ట్ర పార్టీ ను నియమించడమైనది. నిన్న ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ రాష్ట్ర కమిటీ ప్రకటించారు. ఈ కమిటీ లో తూర్పుగోదావరి జిల్లా నుండి రాజమండ్రికి చెందిన కాలెపు సత్య సాయిరామ్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమించారు. కాలెపు సత్య సాయిరామ్ గతంలో జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడుగా, బీజేపీ జిల్లా కార్యదర్శిగా ప్రస్తుతం ఓబీసీ మోర్చా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడుగా ఐదు సంవత్సరాలుగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ 2024 ఎన్నికల్లో బీసీ లను ఏకతాటిపైకి తీసుకువచ్చి రాజమండ్రి పార్లమెంట్ సీటు అత్యధిక మెజారిటీ తో విజయం సాధించడం లో కీలక పాత్ర పోషించారు. ఈ తరుణంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా కాలెపు సత్యసాయి రామ్ ను రాష్ట్ర పార్టీ నియమించడం పట్ల బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

### న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటుకు

# కృషి చేయండి

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ వినతి



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : దేశంలో న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటుకు తమ వంతు కృషి చేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గొట్టిముక్కల అనంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావులు భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజమహేంద్రవరం విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును రాజమండ్రి ఎయిర్ పోర్ట్‌లో అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గొట్టుముక్కల అనంతరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్రంలో చేస్తున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ముఖ్యంగా న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు విషయంలో కేంద్రంతో మాట్లాడాలని వారు కోరారు. తప్పనిసరిగా ఈ విషయంలో తన వంతు కృషి చేస్తానని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. అలాగే అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న సేవలను వెంకయ్యనాయుడు ప్రశంసించారు.

# ఘనంగా శోభిత్ వర్మ శోభాయమాన సత్కారాలు

## చల్లగాలి శ్రీనివాస్ వర్మ చేతులమీదుగా సేవా పురస్కారాలు అందజేత



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : అలుపెరగని నిస్వార్థ కళాతపస్వి, బహుముఖ కళా ప్రపూర్ణ డాక్టర్ చల్లగాలి శ్రీనివాస్ వర్మ ప్రతినెలా అందజేస్తున్న కళాసేవ పురస్కారాలు ప్రధానోత్సవం స్థానిక జ్ఞాన సరస్వతి పీఠంలో జరిగింది. ఆరుగురు విశిష్ట వ్యక్తులకు, ముగ్గురు కళాకారులకు, ముగ్గురు సంఘ సేవకులకు శోభిత్ వర్మ శోభయమైన సత్కారాలు నిర్వహించారు. ప్రముఖ ఇంద్రజాలకుడు వివి రమణ తన ఇంద్రజాలం ద్వారా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. తను చేసిన వాటిలో మైండ్ మ్యాజిక్ శ్రోతలను ఎంతగానో అలరించింది. ఆర్ఎంసిలో ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న షేక్ మదర్సా అలీ చక్కటి పాటలతో ప్రేక్షకులని అలరించారు. అదేవిధంగా డాక్టర్ బి.రమాదేవి తన కవితలతో చక్కటి ప్రసంగంతో ఆహుతులను మంత్ర ముగ్ధులను చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కమాండెంట్ ఎస్పీ కొండ నరసింహారావు మాట్లాడుతూ ఒక మెజీషియన్ అయిన వర్మ ఇతర మెజీషియన్లను తీసుకువచ్చి వారితో ప్రదర్శన చేయించి వారికి సన్మానం చేయటం మామూలు విషయం కాదన్నారు. శోభిత్ వర్మకు మ్యాజిక్ మీద ఉన్న మక్కువతోటి తను చిన్నతనంలోనే చక్కటి ప్రదర్శనలు చేసినందుకు గుర్తుగా తండ్రి, ప్రముఖ ఇంద్రజాలకులు డాక్టర్ శ్రీనివాస్ వర్మ ప్రతినెల ఒక మెజీషియన్ ని సన్మానించడం నిస్వార్థ కళ అనటానికి ఇది గొప్ప నిర్వచనం అన్నారు. డిఎస్పి సత్యనారాయణ మాట్లాడుతూ అంతరించి పోతున్న కళలకు జీవం పోసే మహోన్నతమైన కార్యక్రమాన్ని చేపట్టిన నిస్వార్థ కళాతపస్వి శ్రీనివాస్ వర్మ, కృష్ణమాచారికి ఇతర కమిటీ సభ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ నెల సన్మాన కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు, ప్రముఖ నక చిత్ర కళాకారులు పరసా రవి, బొబ్బిలికి చెందిన కానిస్టేబుల్ కొరిమి కృష్ణమూర్తి, ప్రముఖ ఇంద్రజాలకులు బివి రమణ, రాజమహేంద్రవరం మున్సిపల్ ఈఈ మదర్సా అలీ, భమిడిపాటి రాధాకృష్ణ పలు రకాల పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి భగీ రథ రాజు, డాక్టర్ బిహెచ్‌పి రమాదేవి, సింహాద్రి కోటి లింగేశ్వరరావు, కృష్ణమాచారి ప్రసాద్, పట్నాయక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆశయాలను స్వతంత్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ కొనసాగిస్తుంది

## -స్వతంత్ర జనతా పార్టీ అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : భారత రాజ్యాంగ నిర్మాత, దేశ భవిష్యత్తు ప్రదాత బాబాసాహెబ్ అంబేద్కర్ మహా పరినిర్వాణం (వర్ధంతి) సందర్భంగా "స్వతంత్ర స్టూడెంట్స్ ఫెడరేషన్" తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గుదే వంశీ ఆధ్వర్యంలో జరిగిన వ్యాసరచన పోటీలకు బహుమతి ప్రధాన కార్యక్రమం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా "స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్)" అధ్యక్షులు బర్రే ఆనంద్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. రామచంద్ర ఆర్.కె, అల్యూమిని అసోసియేషన్ అధక్షులు ముళ్ళ మాధవ్, సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బర్రే ఆనంద్ కుమార్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ మన దేశానికి రాజ్యాంగాన్ని మాత్రమే కాదని వర్తమాన భవిష్యత్తులను అందించారన్నారు. రాజ్యాంగం ఏర్పడడానికి ముందే, ఓటు హక్కు, రిజర్వేషన్లు, రిజర్వ్ బ్యాంక్, తదితర అన్ని అంశాలలో మన దేశానికి ఏమేం కావాలో అన్నింటినీ కల్పించి, దేశ ప్రజలకు ఎవరికి దక్కవలసిన హక్కులు వారికి అందించిన మహనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను అందుకొని, ఆలోచనలను ముందుకు నడిపించే బాధ్యతను "స్వతంత్ర స్టూడెంట్స్ ఫెడరేషన్" తీసుకుంటుందని, అందులో భాగంగా ఈరోజు జరిగిన కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించిన ఆర్గనైజేషన్ జిల్లా కార్యకర్తలందరికీ అభినందనలు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డా.రామచంద్ర ఆర్.కె మాట్లాడుతూ, విద్యార్థిని విద్యార్థులు తమ స్వలాభాల కోసం కాకుండా సమాజ ఉన్నతి కోసం పరిశ్రమించాలని, అప్పుడే మనం చదివిన చదువు వినియోగింపబడినట్లని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ఎక్కువగా జరగడం వల్ల విద్యార్థిని విద్యార్థులలో చైతన్యం బలపడుతుందని అన్నారు. అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షులు ముళ్ళ మాధవ్ మాట్లాడుతూ, దేశం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన త్యాగాలు చరిత్ర మరవబోదని, ఆ మహనీయుడు అందించిన హక్కుల కారణంగానే ఈరోజు కోట్లాది మంది జీవిస్తున్నారని, ఆయన వర్ధంతి రోజున విద్యార్థిని విద్యార్థులను చైతన్యవంతులను చేసే ఇటువంటి కార్యక్రమం చేయడం అభినందించవలసిన విషయమని పేర్కొన్నారు. స్వతంత్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గుదే వంశీ మాట్లాడుతూ, ఆర్గనైజేషన్ ద్వారా ఏర్పాటుచేసిన మొదటి కార్యక్రమం విజయవంతం కావడం సంతోషించవలసిన అంశం అని భవిష్యత్తులో ఇటువంటి అనేక కార్యక్రమాలను ముందుకు నడిపించి బాబాసాహెబ్ అంబేద్కర్ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు, బర్రే ఆనంద్ కుమార్ సూచనలతో ముందుకు సాగుతామన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. మొదటి బహుమతి సొంగా రత్న కిషోర్, రెండో బహుమతి కారం సంధ్య కుమారి, మూడో బహుమతి యు. ప్రవల్లిక పొందారు. మరో పదిమంది కన్సోలేషన్ బహుమతులను సాధించారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, కుసుమ, బి.మమత, వి.చేతన్ రాజ్, కే.హర్షిక, స్నేహలత, అనూష, టీ.నందిని, బి.హర్షిని, టి.మహేష్ ఈ కార్యక్రమంలో సోళ్ళ విజయ్ రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, బండి వంశి, జి.అమర్, గోకి అనిల్, కే జీవన్, కాకి శాంతి స్వరూప్, వినయ్, రాజేష్, విస్సాకోటి శ్రీను, ఇజ్జిన రాంబాబు, కాకి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి జోన్ మాస్టర్ ఒరిటర్ పోటీలు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : రాజమండ్రి జోన్ వైడ్ గా పలు నారాయణ బ్రాంచ్ లు మాస్టర్ ఒరిటర్ పోటీలు రాజమండ్రి క్లస్టర్ ప్రిన్సిపాల్ ఆళ్ల నీరజ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధులు గా బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ గౌరవ సలహాదారు నర్సిపల్లి హారిక, సైంటిస్ట్ హేమ హాజరవ్వగా ఇందులో భాగంగా విద్యార్థులందరూ చక్కగా వారి శైలిలో ప్రతిభ ను ప్రదర్శించారు. చిన్న వయస్సు నుంచే ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా నారాయణ విద్యాసంస్థలు ప్రత్యేక బృందం తో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని క్లస్టర్ ప్రిన్సిపాల్ ఆళ్ల నీరజ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఏజీఎంలు ఆలీషా , శ్రీనివాస్ రెడ్డి, రాఘవేంద్ర, స్రవంతి, ఆర్ అండ్ డి హెడ్స్ రవి, మోహిని, సుస్మిత, హెచ్ ఆర్ సుభద్ర, సాఫ్ట్ స్కిల్స్ హెడ్స్ షకీల్, రాధకృష్ణ, దివ్య, కోఆర్డినేటర్లు గోపి నాయుడు, మాధురి, హరిత, స్రవంతి, ప్రిన్సిపాల్స్ నందకుమార్, సునీత, శైలజ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినీ వాయిస్ CINEMA

# నడుము అందాలతో ఆగం చేయకే పిల్లా.. రాశి సింగ్



అందాల చిన్నది రాశి సింగ్ తన క్యూట్ నెస్‌తో ప్రతి ఒక్కరి మనసు దోచేస్తుంది. నడుము అందాలను చూపిస్తూ, ఆరెంజ్ కలర్ డ్రెస్‌తో ప్రతి ఒక్కరినీ మాయ చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ హల్ చల్ చేస్తున్నాయి. యంగ్ బ్యూటీ రాశి సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ చిన్నది శశి అనే మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ తెలుగు అభిమానుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. అంతే కాకుండా ఈ బ్యూటీ నటనకు కూడా మంచి మార్కులే పడ్డాయి. మొదటి మూవీతోనే తన అంద, అభినయంతో ప్రతి ఒక్కరి మనసు దోచేసిన ఈ చిన్నది తర్వాత వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ అవుతుంది అనుకున్నారు. కానీ ఈ మూవీ తర్వాత ఈ అమ్మడుకు ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం రావడం లేదు. ఈ మధ్య ఈ బ్యూటీ హీరో రాజ్ తరుణ్ సరసన పాంచ్ మీనార్ మూవీలో నటించిన విషయం తెలిసిందే. సినిమాలే కాకుండా ఈ బ్యూటీ వెబ్ సిరీస్ చేస్తూ ఫుల్ బిజీగా గడిపేస్తుంది. 3 రోజెస్ అనే వెబ్ సీరీస్ సీజన్‌లో ఈ బ్యూటీ కీలక పాత్రలో కనిపించి మెప్పించనుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ ఎప్పటికప్పుడు తన అంద చందాలతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. చీరలో తన అందాల హోయలు చూపిస్తూ కుర్రకారును ఫిదా చేస్తుంది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు, తాజాగా ఆరెంజ్ కలర్ డ్రెస్‌తో తన క్యూట్ నెస్‌తో ఆకట్టుకుంటుంది. ఇందులో ఈ ముద్దుగుమ్మ అందాలకు ప్రతి ఒక్కరూ ఫిదా అవుతున్నారు. దీంతో నీ నడుము అందాలతో ఆగం చేయకంటూ కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్.

## ఓటిటిలో అదరగొడుతున్న రష్మిక కొత్త సినిమాల్లో ఒకటి!




నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్ గానే కాకుండా ఆమె ప్రధాన పాత్రలో నటించిన సినిమాలు కూడా కొన్ని ఈ ఏడాదిలో పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కి వచ్చాయి. అయితే ఈ నవంబర్, డిసెంబర్ రెండు నెలల్లో కొన్ని వారాల గ్యాప్ లోనే ఆమె నుంచి రెండు సినిమాలు 'థామా' అలాగే 'ది గర్ల్ ఫ్రెండ్' అనే రెండు సినిమాలు వచ్చాయి. అయితే ఈ చిత్రాలు రెండూ రీసెంట్ గానే ఓటిటి ఎంట్రీ ఇచ్చాయి. మరి వీటిలో ది గర్ల్ ఫ్రెండ్ కి నెట్ ఫ్లిక్స్ లో అదిరే రెస్పాన్స్ వస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా ఇండియా వైడ్ నెంబర్ 1 స్థానంలో ట్రెండింగ్ అవుతుంది. దీనితో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఇక ఈ సినిమా ప్రస్తుతం పాన్ ఇండియా భాషల్లో స్ట్రీమ్ అవుతుండగా ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి, రావు రమేష్ అలాగే రోహిణిలు సాలిడ్ పాత్రల్లో నటించారు. అలాగే హేషం అబ్దుల్ వాహాబ్ సంగీతం అందించిన ఈ సినిమాను విద్యా కొప్పినీడి అలాగే ధీరజ్ మొగిలినేనిలు నిర్మాణం వహించారు.

## 'మహేష్' ఎంట్రీపై అనిల్ రావిపూడి క్రేజీ కామెంట్స్






రాజమౌళి – మహేష్ బాబు కలయికలో 'వారణాసి' సినిమా వస్తున్న సంగతి తెలిసిందే. ఐతే, 'వారణాసి' ఈవెంట్‌లో మహేశ్ బాబు ఎద్దుపై వచ్చిన ఎంట్రీ సీన్ చూసి తాను ఆశ్చర్యపోయినట్లు దర్శకుడు అనిల్ రావిపూడి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 'వారణాసి' సినిమా గురించి అనిల్ రావిపూడి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇంతకీ అనిల్ రావిపూడి ఏం మాట్లాడారు అంటే.. 'ఇటీవల విడుదలైన 'వారణాసి' గ్లింప్స్ చూసి మహేశ్‌బాబుకు ఫోన్ చేసి చాలాసేపు మాట్లాడాను. అంత భారీగా, క్రియేటివ్‌గా ఉంటుందని నేను ఊహించలేదు' అని అనిల్ చెప్పుకొచ్చారు. అనిల్ రావిపూడి ఇంకా మాట్లాడుతూ 'ఆ గ్లింప్స్‌లోని ప్రతి షాట్ నన్ను షాక్‌కు గురి చేసింది. ప్రతి ఫ్రేమ్ టైమ్ ట్రావెలర్‌లా అనిపించింది. రాజమౌళి నుంచి మరో అద్భుతం రానుందని ఆ గ్లింప్స్ చూశాక అర్థమైంది' అని అనిల్ రావిపూడి అన్నారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి చిరంజీవి హీరోగా "మన శంకర వరప్రసాద్ గారు" సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలో మరో హీరో వెంకటేష్ కనిపించబోతున్న సంగతి తెలిసిందే.

క్రీడా వాయిస్

# దేశమే ముఖ్యం..

### ఆ బాధలోనూ గ్రౌండ్‌లో దిగిన స్మృతి మంధాన..!



పలాష్ తో వివాహం విడిపోయిన తర్వాత స్మృతి మంధాన నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న తొలి ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మహిళల వన్డే ప్రపంచ కప్ గెలిచిన తర్వాత స్మృతి మంధాన నెట్స్‌లో బ్యాట్ పట్టుకుని కనిపించడం ఇదే తొలిసారి. టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన తన వ్యక్తిగత జీవితంలో జరిగిన ఒక ఊహించని పరిణామాన్ని పక్కనపెట్టి, దేశం కోసం తిరిగి మైదానంలోకి దిగారు. సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌తో జరగాల్సిన తన వివాహం రద్దయినట్లు ప్రకటించిన మరుసటి రోజే ఆమె క్రికెట్ ప్రాక్టీస్ మొదలుపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది.

**అసలు ఏం జరిగిందంటే:**

స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్‌ల వివాహం నవంబర్ 23న జరగాల్సి ఉండగా, స్మృతి తండ్రి అనారోగ్యం కారణంగా వాయిదా పడింది. అయితే, తాజాగా ఈ పెళ్లి పూర్తిగా రద్దయినట్లు స్మృతి సోషల్ మీడియా ద్వారా ధృవీకరించిన సంగతి తెలిసిందే. "నా పెళ్లి ఆగిపోయింది. ఈ విషయాన్ని ఇక్కడితో ముగించాలనుకుంటున్నాను. దయచేసి మా కుటుంబాల ప్రైవసీని గౌరవించండి" అని ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో కోరారు. ఈ వ్యక్తిగత బాధ నుంచి తేరుకోవడానికి సమయం తీసుకోకుండా, స్మృతి వెంటనే తన కర్తవ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. డిసెంబర్ 21 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న 5 మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం ఆమె నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించింది.

**స్మృతి ఏమన్నారంటే..**

"నన్ను నడిపించేది దేశమే. అత్యున్నత స్థాయిలో నా దేశానికి ప్రాతినిధ్యం వహించడమే నాకు ముఖ్యం. సాధ్యమైనంత కాలం భారత్ తరపున ఆడి ట్రోఫీలు గెలవడమే నా లక్ష్యం," అని స్మృతి తన అంకితభావాన్ని చాటుకుంది. వ్యక్తిగత జీవితంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ, ఆటపై ఆమెకున్న నిబద్ధతను చూసి అభిమానులు, క్రికెట్ వర్గాలు ఆమెను ప్రశంసిస్తున్నాయి.

### సడన్‌గా రిటైర్మెంట్ ప్రకటించిన

# తలపొగరోడు..

### ఆ ఫార్మాట్‌కు పనికిరానంటూ ముందే హింట్?






ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ రాష్ట్ర స్థాయి రెడ్-బాల్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నిర్ణయం షెఫీల్డ్ షీల్డ్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి అతని ప్రయత్నాలను క్లిష్టతరం చేసింది. యాషెస్ సిరీస్ సందర్భంగా వచ్చిన ఈ నిర్ణయం మార్ష్ టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై ప్రశ్నలను లేవనెత్తింది. అయితే, జాతీయ జట్టుకు ఎంపికైతే తాను టెస్టులు ఆడటానికి సిద్ధంగా ఉన్నానని మార్ష్ స్పష్టం చేశాడు. స్ట్రేలియా క్రికెట్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో స్వదేశంలో యాషెస్ టెస్ట్ సిరీస్ ఆడుతోంది. ఈ సిరీస్ మధ్యలో, ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు ఆశ్చర్యకరమైన నిర్ణయం తీసుకున్నాడు. ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ రాష్ట్ర స్థాయి రెడ్-బాల్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఫలితంగా, అతను ఇకపై షెఫీల్డ్ షీల్డ్ టోర్నమెంట్‌లో వెస్ట్రన్ ఆస్ట్రేలియా తరపున ఆడడు. ఈ నిర్ణయం మార్ష్ టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై ప్రశ్నలను లేవనెత్తింది. యాషెస్ సిరీస్‌కు మార్ష్ ఎంపిక చేస్తారని భావించినందున, ఈ నిర్ణయం చాలా సందేహాలను లేవనెత్తింది.

**మార్ష్ ఆశ్చర్యకరమైన నిర్ణయం..**

మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన మ్యాచ్‌లలో నిరాశపరుస్తున్న మార్ష్, తన నిర్ణయాన్ని తన సహచరులకు తెలియజేశాడు. 2019 నుంచి అతను బిజీ అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా రాష్ట్ర స్థాయిలో తొమ్మిది మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 2009లో వెస్ట్రన్ ఆస్ట్రేలియా తరపున అరంగేట్రం చేసిన మార్ష్, ఇప్పుడు రెడ్-బాల్ క్రికెట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. కానీ జాతీయ జట్టుకు టెస్ట్ మ్యాచ్‌లు ఆడటానికి తలుపు పూర్తిగా మూసివేయలేదని అతను స్పష్టం చేశాడు. సెలెక్టర్లు పిలిస్తే యాషెస్ సిరీస్‌లో పాల్గొనడానికి తాను సిద్ధంగా ఉన్నానని మార్ష్ స్పష్టం చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే, షీల్డ్ మ్యాచ్‌లకు దూరంగా ఉన్న మార్ష్‌కు యాషెస్ సిరీస్‌లో ఆడే అవకాశం దక్కడం సందేహమే. అంతకుముందు, ఆస్ట్రేలియా చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ నవంబర్‌లో మార్ష్ ప్రదర్శన యాషెస్‌కు కొత్త శక్తిని తీసుకురాగలదని అన్నారు. సిరీస్ ప్రారంభంలో మార్ష్‌ను ఎంపికకు పరిగణించలేదు. కానీ పరిస్థితిని బట్టి తరువాత మార్పులు చేస్తామని ఆయన అన్నారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com